# పెన్ పవర్

PEN POWER 12 YEARS JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 2 సంచిక : 6 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల గురువారం 10 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE : 6 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA THU 10 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## నన్ను జైల్లో పెట్టగలిగారు కానీ, నా స్థైర్యాన్ని దెబ్బతీయలేకపోయారు

### చంద్రబాబు ట్వీట్

- మూడేళ్ల క్రితం తన అరెస్టును గుర్తు చేసుకున్న సీఎం చంద్రబాబు
- ప్రజల మద్దతుతో 2024 ఎన్నికల్లో నిజం గెలిచిందన్న టీడీపీ అధినేత
- రాష్ట్రవ్యాప్తంగా 'నిజం గెలిచింది' పేరుతో కార్యక్రమాల నిర్వహణ
- తెలుగు జాతిని నంబర్ 1 చేయడమే తన లక్ష్యమని పునరుద్ఘాటన

పెన్ పవర్ డెస్క్:"ప్రజల కోసం నిలబడితే ప్రజలు మన వెంట నిలబడతారు, నిజం కోసం నిలబడితే నిజమే మనల్ని నిలబెడుతుంది. ఇదే నా నమ్మకం" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధినేత చంద్రబాబు అన్నారు.

- మిగతా 2లో

# ప్రతి వారం ప్రజల మధ్యనే ఉంటా

- కోనసీమ జిల్లాలో 'మీ భూమి - మీ హక్కు' గ్రామసభ
- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్న చంద్రబాబు
- గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దుతూ రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన
- 16 లక్షల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించినట్టు వెల్లడి
- భూమికి పూర్తి భద్రత కల్పించేలా రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాలు
- రూ.240 కోట్లతో ఈపీడీసీఎల్ గ్రిడ్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన



పెన్ పవర్ డెస్క్:సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు మూల మంత్రాలతోనే కూటమి ప్రభుత్వం ముం దుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సచివాలయానికి పరిమితమై పనిచేయడం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల మధ్య ఉంటూ వారి జీవితాల్లో వెలుగులు నింపడమే అసలైన సుపరిపాలన అని, దానికోసం తమ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఉద్ఘాటిం చారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గంలోని మాచవరం పండువారిపేటలో బుధవారం నిర్వహించిన 'మీ భూమి - మీ హక్కు' గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి వారం ప్రజల వద్దకే వస్తున్నానని, వారి బాగోగులు తెలుసుకుంటూ పాలన సాగిస్తున్నానని తెలిపారు. ప్రతినెలా ఒకటో తేదీన పేదల వద్దకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందిస్తూ వారి కష్టసుఖాలను తెలుసుకుంటున్నానని సీఎం గుర్తుచేశారు. అలాగే, ప్రతి నెలా మూడో శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'

- మిగతా 2లో



## 53 రోజులు జైల్లో చంద్రబాబు.. 53 కొవ్వొత్తులు వెలిగించిన నారా లోకేశ్

- చంద్రబాబు అరెస్టు జరిగి నేటికి మూడేళ్లు పూర్తి
- 'నిజం గెలిచింది' నినాదంతో నిరసన తెలిపిన నారా లోకేశ్
- 53 రోజుల నిర్బంధానికి గుర్తుగా 53 కొవ్వొత్తులు వెలిగింపు
- జగన్ కుట్రపూరితంగా తప్పుడు కేసు పెట్టారని లోకేశ్ ఆరోపణ
- ఉండవల్లి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమ ఫొటోలు సోషల్ మీడియాలో షేర్

పెన్ పవర్ డెస్క్:తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు జరిగి నేటికి సరిగ్గా మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఏపీ మంత్రి, టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్ నిరసన తెలిపారు. 'నిజం గెలిచింది' అనే నినాదంతో ఉండవల్లిలోని తన నివాసంలో 53 కొవ్వొత్తులు వెలిగించి, నాటి ఘటనను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను ఆయన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ స్పందిస్తూ.. మూడేళ్ల క్రితం ఇదే రోజున నాటి ముఖ్యమంత్రి జగన్ రాజకీయ దురుద్దేశంతో, కుట్రపూరితంగా తప్పుడు కేసు బనాయించి చంద్రబాబును అర్ధరాత్రి అరెస్టు చేయించారని

- మిగతా 2లో

## ఏపీలో స్థానిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఖరారుకు షెడ్యూల్ విడుదల

- సెప్టెంబర్ 11న ఫొటో సహిత ఓటర్ల జాబితా ప్రదర్శన
- 15వ తేదీన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా రూపకల్పన
- 19న ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ కేంద్రాల తుది జాబితా రూపకల్పన

- మిగతా 2లో



## స్థానిక సంస్థల ఎన్నికలు కురుక్షేత్ర సంగ్రామంలాంటివి

- అధికార దుర్వినియోగం, అక్రమ కేసులను ఎదుర్కొని వైసీపీ శ్రేణులు నిలబడాలని పిలుపు
- సర్ ప్రక్రియలో 44 లక్షల ఓట్లు గల్లంతయ్యాయని వెల్లడి
- స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా



పెన్ పవర్ డెస్క్:రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ఒక 'కురుక్షేత్ర సంగ్రామం' లాంటివని వైసీపీ అధినేత జగన్ అన్నారు. అధికార దుర్వినియోగం, పోలీసు బలగాల

- మిగతా 2లో



## తిరుమల భక్తులకు ఇకపై రూ.10 లక్షల బీమా

- భక్తుల ప్రమాద బీమా రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు
- సహజ మరణానికి రూ.2 లక్షల బీమా
- బీమా పథకానికి ఎల్ఐసీకి రూ.2.12 కోట్ల ప్రీమియం చెల్లింపు
- లడ్డూ తయారీకి 400 అదనపు పోస్టులకు ప్రతిపాదనలు
- ఆహార వ్యర్థాలతో బయోగ్యాస్ తయారీకి ప్లాంట్

- మిగతా 2లో



తెలుగు రాష్ట్రాలకు రైల్వే శుభవార్త..

## కొత్త లైన్లకు కేంద్రం ఆమోదం

- దేశవ్యాప్తంగా రైల్వే మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం
- ఘట్‌కేసర్-కాజీపేట మధ్య నాలుగో లైన్‌కు గ్రీన్ సిగ్నల్
- అరక్కోణం-రేణిగుంట మధ్య 3వ, 4వ లైన్ల నిర్మాణానికి ఆమోదం
- మూడు ప్రాజెక్టుల కోసం రూ. 10,021 కోట్లు కేటాయింపు
- ఏపీ, తెలంగాణలో రైల్వే సామర్థ్యం పెంచడమే లక్ష్యం

పెన్ పవర్ డెస్క్:రైల్వే వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని రద్దీ మార్గాలతో సహా దేశవ్యాప్తంగా పలు మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం

- మిగతా 2లో

## మళ్లీ అదే సెంటిమెంట్‌తో... జగన్ పాదయాత్ర 2.0కు ముహూర్తం ఖరారు



- మరోసారి సుదీర్ఘ పాదయాత్రకు సిద్ధమైన వైఎస్ జగన్
- 2027 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో యాత్ర ప్రారంభం
- బాపట్ల జిల్లా పర్చూరు కార్యకర్తల సమావేశంలో ప్రకటన
- 2029 ఎన్నికలే లక్ష్యంగా రెండో విడత యాత్రకు వ్యూహరచన
- 'ప్రజా సంకల్ప యాత్ర' సెంటిమెంట్‌నే మళ్లీ ఫాలో అవుతున్న జగన్

- మిగతా 2లో

## "బాత్రూమ్‌లోకి కూడా వస్తారా?".. మీడియాపై పినరయి విజయన్ ఫైర్

- ఈడీ కేసుపై మీడియా ప్రశ్నలకు తీవ్రంగా స్పందించిన పినరయి విజయన్
- "నాతో పాటు బాత్రూమ్‌లోకి కూడా వస్తారా?" అంటూ విలేకరులపై ఆగ్రహం
- విజయన్, ఆయన కుమార్తె, అల్లుడిపై కేసు నమోదు చేయాలని ఈడీ సిఫార్సు
- విలేకరులతో మాట్లాడటానికి విజయన్ నిరాకరించడం కొత్తేమీ కాదని విశ్లేషణలు
- గతంలోనూ మీడియా ప్రతినిధులపై ఆయన ఇలాగే ప్రవర్తించారు



పెన్ పవర్ డెస్క్:కేరళ ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మరోసారి మీడియా ప్రతినిధులపై తనదైన శైలిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసు గురించి మీడియా వెంటపడడంతో సహనం కోల్పోయారు. "నాతో పాటు బాత్రూమ్‌లోకి కూడా వస్తారా?" అని

- మిగతా 2లో



## 'ఎంత ధైర్యం?'..

### విద్యార్థికి నోటీసులపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- న్యాయ విద్యార్థికి గ్రేటర్ నోయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసులు
- నోటీసులు ఉపసంహరించినా తీవ్రంగా స్పందించిన కోర్టు
- విద్యార్థులపై చర్యలు వద్దని గతంలోనే ఆదేశాలిచ్చామని గుర్తుచేసిన కోర్టు
- యూపీ అధికారులపై అలహాబాద్ హైకోర్టు మండిపాటు
- ఆకృతి చౌధరి ఎన్ఎస్ఏ నిర్బంధం రద్దు

- మిగతా 2లో

## ఈ20 పెట్రోల్‌తో వాహనాలకు నష్టం లేదు

- ఈ20 ఇంధనంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ప్రకటన.. కేంద్రానికి మద్దతు
- తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అసెంబ్లీలో వెల్లడి
- ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వాదనకు తెలంగాణ మద్దతు



పెన్ పవర్ డెస్క్:ఇథనాల్ కలిపిన ఈ20 పెట్రోల్ వాడకం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్రంలో తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఆయన శాసనసభలో వెల్లడించారు. ఈ20 పెట్రోల్ వల్ల వాహనాలు పాడవుతున్నట్లు వాహన యజమానుల నుంచి గానీ, ఆటోమొబైల్ రంగ నిపుణుల

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# "సేన" వాటా ఇదే

స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన డిమాండ్లు భారీగానే ఉండనున్నాయి. ఒకరకంగా టీడీపీని కొంత ఇబ్బందికరమైన పరిణామమే. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన సిద్ధమవుతుంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు సంబంధించి అధికార కూటమిలో సీట్ల సర్దుబాటు, డిమాండ్ల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం కోసం సీట్ల విషయంలో రాజీ పడిన జనసేన పార్టీ, ఈసారి క్షేత్రస్థాయిలో పార్టీ బలం, కార్యకర్తల ఆత్మగౌరవాన్ని దృష్టిలో ఉంచుకుని గట్టి డిమాండ్లనే ముందుంచుతోంది. తమ పార్టీ కార్యకర్తలలో జోష్ నింపాలంటే ఈ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో పోటీ చేయాలని జనసేన భావిస్తుంది. ఇప్పటికే జనసేన నుంచి నివేదిక సిద్ధమయినట్లు సమాచారం. చంద్రబాబు వద్ద చర్చల్లో ఈ నివేదిక మేరకు పెట్టే అవకాశముందని తెలిసింది.

**జనసేన ప్రధాన డిమాండ్లుఇవేనట...**

స్థానిక సంస్థల ఎన్నికల్లో 30 శాతం సీట్ల వాటాను జనసేన కోరుకుంటుంది. 2024 సార్వత్రిక ఎన్నికల నాటి తక్కువ సీట్ల ఫార్ములా స్థానిక సంస్థల ఎన్నికలకు వర్తించదని జనసేన స్పష్టం చేసింది. తెలుగుదేశం పార్టీ ప్రాథమికంగా 15% సీట్లు ఇవ్వాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండగా, జనసేన మాత్రం కనీసం 25 నుండి 30 శాతం సీట్లను కేటాయించాలని గట్టిగా డిమాండ్ చేస్తోంది. నామినేషన్లకు ముందు ఇతర పార్టీల నుంచి వచ్చే వలస నాయకులకు జనసేన కోటాలో సీట్లు ఇవ్వకూడదని, క్షేత్రస్థాయిలో కష్టపడిన అసలైన జనసైనికులకే టికెట్లు కేటాయించాలని పార్టీ శ్రేణులు అధిష్ఠానాన్ని కోరుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఒకే ఫార్ములా కాకుండా, ఆయా జిల్లాల్లో జనసేనకు ఉన్న క్షేత్రస్థాయి బలం, సామాజిక సమీకరణల ఆధారంగా సీట్ల పంపిణీ జరగాలని కోరుతోంది. ఈ మేరకు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. చంద్రబాబును ఒప్పించేందుకు కూడా పవన్ సిద్ధమయినట్లు సమాచారం.

**జనసేన ఆశిస్తున్న కార్పొరేషన్లు ఇవే...**

ముఖ్యంగా జనసేన బలంగా ఉన్న ఉమ్మడి గోదావరి, కృష్ణా, విశాఖపట్నం మరియు గుంటూరు జిల్లాల్లోని కార్పొరేషన్లపై పార్టీ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు విశాఖపట్నం మేయర్ అభ్యర్థిని తమకే కేటాయించాలని అడిగే అవకాశముంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో విజయవాడ నగర పరిధిలో జనసేన ఒక్క సీటులో కూడా పోటీ చేయలేదు. కాబట్టి, ఈసారి విజయవాడ మేయర్ పీఠాన్ని లేదా మెజారిటీ డివిజన్లను తమకే కేటాయించాలని జనసేన నేతలు బలంగా డిమాండ్ చేస్తున్నారు.

**రాజమహేంద్రవరం కార్పొరేషన్ :**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేనకు బలమైన కోట కావడంతో, ఈ కార్పొరేషన్ మేయర్ స్థానం లేదా అత్యధిక వార్డులు తమకే దక్కాలని పట్టుబడుతోంది.

**కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్:**

కాకినాడ నగర మరియు గ్రామీణ పరిధిలో పార్టీకి ఉన్న బలమైన క్యాడర్ రీత్యా ఇక్కడ మేయర్ అభ్యర్థిత్వంపై జనసేన కన్నేసింది. విశాఖపట్నం : ఉత్తరాంధ్రలో పార్టీ ఉనికిని మరింత చాటుకునేందుకు వీలుగా విశాఖ పట్నంలోని కీలక డివిజన్లతో పాటు డిప్యూటీ మేయర్ లేదా మేయర్ రేసులో భాగస్వామ్యం కోరుతోంది. రాజధాని ప్రాంత పరిధిలోని స్థానాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది తిరుపతి : తిరుపతిలోనూ జనసేన పాగా వేయాలని చూస్తుంది. తిరుపతి కార్పొరేషన్ సీటును జనసేనకు ఇవ్వాలని కోరనుంది. జనసేన తిరుపతి నియోజకవర్గం పరిధిలో బలంగా ఉండటంతో ఇక్కడ కూడా తాము పోటీ చేస్తామన్న ప్రతిపాదనతో చర్చలకు సిద్ధమవుతుంది. ఈ ప్రతిపాదనలతో టీడీపీకి కొంత ఇబ్బందికరంగా మారే అవకాశముంది. ఉత్తరాంధ్రలో, రాయలసీమలో అత్యధికంగా ఉన్న తమ పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఒకవైపు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఏం జరుగుతుందన్నది ఉత్కంఠగా మారింది.

## ఈ20 పెట్రోల్‌తో వాహనాలకు నష్టం లేదు

- మొదటి పేజి తరువాయి

నుంచి గానీ రవాణా శాఖ దృష్టికి ఎటువంటి సమాచారం రాలేదని మంత్రి తెలిపారు. "ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించి మా వద్ద ఎటువంటి ప్రతికూల నివేదికలు లేవు. అందువల్ల, దీనిపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసే లేదా నియంత్రణ చర్యలు చేపట్టే ఆస్కారం లేదు" అని ఆయన వివరించారు. ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వ వైఖరితోనే ఏకీభవించారు. గత జూలైలో కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి సైతం లోక్‌సభలో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఇథనాల్ కలిపిన ఇంధనంతోనే నడుస్తున్నాయని, ఇంజన్ వైఫల్యాలపై ఎటువంటి నిర్దిష్ట ఫిర్యాదులు రాలేదని ఆయన వెల్లడించారు. గతంలో సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్), ఈ20 ఇంధనంలోని అధిక తేమ, క్లోరైడ్ స్థాయిల వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పెట్రోలియం మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. అయితే, ఈ అంశంపై మరింత ధ్రువీకరణ అవసరమని పేర్కొంటూ తదనంతరం ఆ లేఖను ఉపసంహరించుకుంది. ప్రస్తుతం అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఈ20 ఇంధనం వల్ల వాహనాలకు ఎలాంటి ముప్పు లేదనే అభిప్రాయంతో ఉన్నాయి.

## "బాత్రూమ్‌లోకి కూడా వస్తారా?".. మీడియాపై పినరయి విజయన్ ఫైర్

- మొదటి పేజి తరువాయి

వారిపై విరుచుకుపడ్డారు.

వివరాల్లోకి వెళితే... బుధవారం చంగనచేరికి వెళుతుండగా మార్గమధ్యంలో విజయన్ మధ్యాహ్నం కల్లిస్సేరిలోని పీడబ్ల్యూడీ రెస్ట్ హౌస్‌లో ఆగారు. అప్పటికే అక్కడ వేచి ఉన్న మీడియా ప్రతినిధులు, ఆయన కారు దిగగానే చుట్టుముట్టి ఈడీ కేసు గురించి ప్రశ్నలు సంధించారు. అయితే విజయన్ మౌనంగా రెస్ట్ హౌస్‌లోకి నడిచారు. విలేకరులు ఆయన్ను అనుసరిస్తూ లోపలికి వెళ్లి మళ్లీ అవే ప్రశ్నలు అడిగారు.ఒక గదిలోకి వెళ్లే ముందు, వెనక్కి తిరిగిన విజయన్ తీవ్ర అసహనంతో.. "నేను ఇక్కడికి వచ్చింది మిమ్మల్ని కలవడానికి కాదు" అని చెబుతూ, "నేను ఎక్కడికి వెళితే అక్కడికి వస్తారా... బాత్రూంలోకి వెళ్లినా వదలరా?" వ్యాఖ్యానించారు. అనంతరం గదిలోకి వెళ్లిపోయారు. కాసేపటి తర్వాత బయటకు వచ్చి మౌనంగానే తన వాహనంలో చంగనచేరికి వెళ్లిపోయారు.

పినరయి విజయన్, ఆయన కుమార్తె టి. వీణ, అల్లుడు, ఎమ్మెల్యే పి.ఎ. మహమ్మద్ రియాస్‌పై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరుతూ ఈడీ ఇటీవల రాష్ట్ర పోలీస్ చీఫ్‌కు సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. మనీ లాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్ 66(2) ప్రకారం ఈడీ తన దర్యాప్తు వివరాలను, ఆధారాలను పోలీసులకు పంపింది. ఈ నేపథ్యంలో మీడియా ఆయన్ను వివరణ కోరే ప్రయత్నం చేయగా ఈ ఘటన చోటుచేసుకుంది. విజయన్ మీడియా పట్ల ఇలా కఠినంగా వ్యవహరించడం ఇది మొదటిసారి కాదు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దశాబ్దాలుగా కొనసాగుతున్న వారపు కేబినెట్ అనంతర మీడియా సమావేశాన్ని రద్దు చేశారు. 2017లో తిరువనంతపురంలో బీజేపీ-ఆర్ఎస్ఎస్ నేతలతో సమావేశానికి వెళ్లినప్పుడు మీడియా ప్రతినిధులను 'బయటకు వెళ్లండి' అంటూ గట్టిగా మందలించిన ఘటన అప్పట్లో వైరల్ అయింది. ఇప్పుడు మరోసారి ఆయన తన పాత పంథానే కొనసాగించారు.

# ప్రతి వారం ప్రజల మధ్యనే ఉంటా

- మొదటి పేజి తరువాయి

కార్యక్రమంలో, నాలుగో శనివారం పీ4 (ప్రజలు, ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యం) కార్యక్రమంలో పాల్గొంటూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి జరిగితేనే సంపద సృష్టి జరుగుతుందని, తద్వారా ప్రజలంతా గౌరవంగా జీవించేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ద

**భూమికి భద్రత.. గత ప్రభుత్వ పాపాల ప్రక్షాళన**

ప్రతి నెలా 9వ తేదీన 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమం ద్వారా రైతులకు, యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని సీఎం తెలిపారు. భూమిపై యజమానులకు తిరుగులేని హక్కులు కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత పాలకులు తమ ఐదేళ్ల పాలనలో రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేశారని, రికార్డులను తారుమారు చేసి ఘోరాలు, నేరాలు, పాపాలు చేశారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో ప్రజల భూములను కాజేసేందుకు కుట్ర పన్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ ప్రమాదకర చట్టాన్ని రద్దు చేసి ప్రజలకు భరోసా ఇచ్చిందని గుర్తుచేశారు."రీసర్వే పేరుతో గత ప్రభుత్వం చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములపై కూడా తమ ఫొటోలు వేసుకున్నారు. సర్వే రాళ్లపై బొమ్మలు వేసుకునే పిచ్చి ఏమిటో ఎవరికీ అర్థం కాలేదు. తమకు ఇష్టం లేని వ్యక్తుల భూములను, ఆస్తులను 22ఏ జాబితాలో చేర్చి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. అందుకే ఇప్పుడు పటిష్ఠమైన రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి, ఎక్కడా అవకతవకలకు తావులేకుండా బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, ఈ-కేవైసీ, క్యూఆర్ కోడ్ వంటి భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నాం"అని చంద్రబాబు వివరించారు.

**రికార్డు స్థాయిలో రెవెన్యూ సంస్కరణలు**

భూమికి సంపూర్ణ భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ అజెండా అని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8,234 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి, 36 లక్షల మందికి రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు అందించామని తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మిగిలిన 8,582 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి మొత్తం 56 లక్షల పాస్ పుస్తకాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆటో మ్యుటేషన్ సేవలు అందుబాటులోకి తెచ్చామని, వారసత్వ భూముల విభజనలో స్టాంప్ డ్యూటీని కేవలం రూ.1000కి పరిమితం చేయడం ద్వారా 1.25 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చామని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించి లక్షలాది మందికి ఊరట కల్పించామని అన్నారు. శెట్టిపల్లి కంగుంది, వట్టిచెరుకూరు, ముదినేపల్లి వంటి ప్రాంతాల్లో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న 244 కీలక భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించామని తెలిపారు. అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రాపురంలో బ్రిటిష్ కాలం నాటి (1908) 22ఏ(1) నిషేధిత భూముల సమస్యను కూడా పరిష్కరిస్తున్నామని, దీని ద్వారా 1410 మందికి చెందిన 56.37 ఎకరాల భూమికి విముక్తి కల్పిస్తున్నామని ప్రకటించారు. "గొడ్డలి పార్టీ తారుమారు చేసిన రికార్డులను ప్రక్షాళన చేసి భూ సమస్యలను కొలిక్కి తెస్తున్నాం" అని ఆయన వ్యాఖ్యానించారు.

**ప్రజల సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యం**

భూమి భద్రతతో పాటు నీటి భద్రతకు కూడా తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సీఎం అన్నారు. ఈ ఏడాది తీవ్రమైన ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ, గోదావరి నుంచి వెయ్యి టీఎంసీలకు పైగా నీరు సముద్రంలో వృథాగా కలిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యం, రాజకీయ కక్షతో కాంట్రాక్టర్‌ను మార్చడం వల్లే పోలవరం డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయి ప్రాజెక్టు ఆలస్యమైందని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ఢిల్లీలో సంజీవనిలా పనిచేసిందని, కేంద్రం నుంచి రాష్ట్రానికి ఎక్కువ నిధులు తెచ్చుకోగలుగుతున్నామని చెప్పారు.

ఈ సందర్భంగా, తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) రూ.240 కోట్ల వ్యయంతో చేపట్టిన గ్రిడ్ ఆధునీకరణ, 3-ఫేజ్ విద్యుత్ సరఫరా పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ గంటి హరీశ్, స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## నన్ను జైల్లో పెట్టగలిగారు కానీ, నా స్థైర్యాన్ని దెబ్బతీయలేకపోయారు

- మొదటి పేజి తరువాయి

మూడేళ్ల క్రితం స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తనను అరెస్టు చేసిన ఘటనను గుర్తు చేసుకుంటూ ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆనాటి పరిణామం తనలో విశ్వాసాన్ని మరింత పెంచిందని పేర్కొన్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఏ తప్పు చేయని తనను కుట్రపూరితంగా అరెస్టు చేసి, 53 రోజుల పాటు జైల్లో నిర్బంధించారని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. "నన్ను జైల్లో పెట్టగలిగారు కానీ, నా స్థైర్యాన్ని దెబ్బతీయలేకపోయారు. వారి రాక్షస చర్యకు నేను కుంగిపోలేదు, లొంగిపోలేదు. దీనికి కారణం నాకు లభించిన ప్రజా మద్దతు" అని ఆయన తెలిపారు. ఆ క్లిష్ట పరిస్థితుల్లో ప్రజాస్వామ్యం కోసం నిలబడిన తెలుగు ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు చూపిన సంఘీభావం తన జీవితంలో మరువలేనిదని అన్నారు. తనను నిర్బంధించినా, దేశ విదేశాల్లో తన కోసం ప్రజలు ఎత్తిన గొంతును నొక్కలేకపోయారని చంద్రబాబు పేర్కొన్నారు.

2024 ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా తమ మద్దతును మరింత బలంగా చాటారని చంద్రబాబు అన్నారు. కక్షసాధింపు రాజకీయాలను ఓడించి,

నిజాన్ని గెలిపించి రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యతను తనకు అప్పగించారని తెలిపారు. ఆనాటి పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా 'నిజం గెలిచింది' పేరుతో కార్యక్రమాలు నిర్వహించడం, ప్రజల కోసం మరింత కష్టపడాలనే సంకల్పాన్ని బలపరిచిందని వివరించారు. ఈ సందర్భంగా తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ మరోసారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలందరి సహకారంతో తెలుగు జాతిని నంబర్ 1 చేయాలనే తన కలను నిజం చేసి తీరుతానని చంద్రబాబు మాట ఇచ్చారు.

## ఏపీలో స్థానిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఖరారుకు షెడ్యూల్ విడుదల

ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ దిశగా రాష్ట్ర ఎన్నికల సంఘం వడివడిగా అడుగులు వేస్తోంది. రాబోయే ఎన్నికలకు సంబంధించి ఫొటోలతో కూడిన పూర్తిస్థాయి ఓటర్ల జాబితాలను తక్షణమే సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో ఎటువంటి లోపాలకు తావులేకుండా పక్కాగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

**ఎన్నికల సంఘం షెడ్యూల్ వివరాలు:**

సెప్టెంబర్ 11: ఫొటో సహిత ఓటర్ల జాబితాల ప్రదర్శన

సెప్టెంబర్ 14: పోలింగ్ కేంద్రాల ముసాయిదా (ఐత్తుట్) జాబితా రూపకల్పన

సెప్టెంబర్ 15: పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా అధికారిక ప్రచురణ

సెప్టెంబర్ 15, 16: పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు, మార్పులు-చేర్పుల వినతుల స్వీకరణ

సెప్టెంబర్ 16: రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల కమిషన్ అధికారుల సమన్వయ సమావేశం

సెప్టెంబర్ 18: పోలింగ్ స్టేషన్ల జాబితాకు జిల్లా కలెక్టర్ల ఆమోదం

సెప్టెంబర్ 19: ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రచురణ.

## తిరుమల భక్తులకు ఇకపై రూ.10 లక్షల బీమా

శ్రీవారి దర్శనానికి వచ్చి ప్రమాదవశాత్తూ మరణించే భక్తుల కుటుంబాలకు అందించే బీమా మొత్తాన్ని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని 'తిరుమల తిరుపతి దేవస్థానం' (టీటీడీ) బోర్డు నిర్ణయించింది. సహజ మరణం సంభవించినా రూ.2 లక్షలు అందించేలా గ్రూప్ ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయనుంది. దేశంలోనే తొలిసారిగా ఎల్ఐసీ ద్వారా ఈ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు టీటీడీ వెల్లడించింది.

తిరుమలలో జరిగిన పాలకమండలి సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వివరాలను వెల్లడించారు. భక్తులు, ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ పలు నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. బీమా పథకం అమలుకు టీటీడీ నిధుల నుంచి ఎల్ఐసీకి రూ.2.12 కోట్లు చెల్లించేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు.సీపీఎస్, ఎన్‌పీఎస్ పెన్షనర్లు, వారి కుటుంబాలకు ఈహెచ్ఎఫ్ సౌకర్యం కల్పించేందుకు రూ.2 కోట్ల యాజమాన్య వాటాకు ఆమోదం తెలిపారు. టీటీడీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 48 మంది ఉద్యోగుల వేతనాలు పెంచాలని నిర్ణయించారు. శ్రీవారి పోటులో లడ్డూల తయారీ వేగం పెంచేందుకు 400 అదనపు అవుట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వ అనుమతి కోరుతూ ప్రతిపాదనలు పంపనున్నారు.తిరుమలలోని అన్నప్రసాద కేంద్రం, క్యాంటీన్లు, హోటళ్ల నుంచి వచ్చే ఆహార వ్యర్థాలతో బయోగ్యాస్ తయారు చేయనున్నారు. ఇందుకోసం ప్లాంట్ నిర్వహణ బాధ్యతలను రూ.2.80 కోట్లతో జీపీఎస్ రెన్యువబుల్స్‌కు అప్పగించేందుకు ఆమోదం తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బందికి రవాణా ఛార్జీల కోసం మూడేళ్లకు రూ.1.60 కోట్లు కేటాయించారు.నారాయణవనం

ఆలయంలో అమ్మవారి పద్మపీఠానికి బంగారు తాపడం చేయాలని నిర్ణయించారు. చెన్నైలోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ ధ్వజస్తంభం, బలిపీఠానికి బంగారు తాపడం కోసం రూ.17.05 కోట్లకు ఆమోదం తెలిపారు. తిరుపతిలోని తెలుగు, సంస్కృత అకాడమీకి కేటాయించిన టీటీడీ భవనం లైసెన్స్ గడువును మరో మూడేళ్లు పొడిగించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆమోదించిన రూ.49 కోట్ల ఆర్థిక సహాయంలో రెండో విడతగా రూ.7.56 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించారు.

## తెలుగు రాష్ట్రాలకు రైల్వే శుభవార్త.. కొత్త లైన్లకు కేంద్రం ఆమోదం

- మొదటి పేజి తరువాయి

మీడియాకు వెల్లడించారు.కేబినెట్ నిర్ణయం ప్రకారం, తెలంగాణలోని ఘట్‌కేసర్-కాజీపేట సెక్షన్‌లో నాలుగో లైను నిర్మాణానికి ఆమోదం లభించింది. 110 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టుకు రూ. 2,419 కోట్లు అవుతుందని అంచనా ఉంది. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ మీదుగా సాగే అరక్కోణం-రేణిగుంట మార్గంలో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుల పూర్తితో ఆయా మార్గాల్లో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.నాలుగు రాష్ట్రాల్లోని 17 జిల్లాల పరిధిలో నాలుగు లైన్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 10,021 కోట్లుగా కేంద్రం పేర్కొంది. దీంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక పరిధిలో ఐదు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు రాబోతున్నాయి.కొత్త లైన్ల నిర్మాణం ద్వారా రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యం పెరగడమే కాకుండా, సరుకు రవాణా, ప్రయాణికుల రైళ్ల వేగం కూడా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిని 2029-30 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక వేసింది.

## మళ్లీ అదే సెంటిమెంట్‌తో... జగన్ పాదయాత్ర 2.0కు ముహూర్తం ఖరారు

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి సుదీర్ఘ పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. 2029 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లేందుకు ఆయన ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా తాను చేపట్టబోయే రెండో విడత పాదయాత్రకు ముహూర్తం ఖరారు చేశారు. 2027 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని స్పష్టత ఇచ్చారు. నేడు బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గ వైసీపీ కార్యకర్తల సమావేశంలో జగన్ ఈ కీలక ప్రకటన చేశారు.గతంలో అధికారం కోసం జగన్ ఇదే ఫార్ములాను అనుసరించిన విషయం తెలిసిందే. 2017 నవంబర్ 6న కడప జిల్లా ఇడుపులపాయలో 'ప్రజా సంకల్ప యాత్ర' పేరుతో ఆయన తన తొలి పాదయాత్రను ప్రారంభించారు. ఆ యాత్ర 341 రోజుల పాటు ఏకధాటిగా సాగి, 3,648 కిలోమీటర్ల దూరం కొనసాగింది. 2019 జనవరి 9న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో యాత్ర ముగిసింది.

ఈ యాత్రలో భాగంగానే ఆయన 'నవరత్నాలు' పథకాలను ప్రకటించారు. ప్రజల నుంచి వచ్చిన అపూర్వ స్పందన, యాత్రలో తెలుసుకున్న సమస్యల ఆధారంగా రూపొందించిన ఈ హామీలు 2019 ఎన్నికల్లో వైసీపీకి చారిత్రాత్మక విజయాన్ని అందించాయి.మళ్లీ అదే సెంటిమెంట్‌తో 2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా జగన్ ఈ రెండో పాదయాత్రకు సిద్ధమయ్యారు. 2027లో యాత్ర ప్రారంభించి, ఎన్నికల వరకు దాదాపు రెండేళ్ల పాటు ప్రజల మధ్యే ఉండాలని ఆయన భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ యాత్ర ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు ప్రస్తుత కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని జగన్ వ్యూహరచన చేస్తున్నారు. త్వరలోనే ఈ పాదయాత్రకు సంబంధించిన పూర్తి షెడ్యూల్, రూట్‌మ్యాప్‌పై స్పష్టత రానుంది. మొత్తం మీద 2029 ఎన్నికల సమరానికి జగన్ ఇప్పటినుంచే 'పాదయాత్ర 2.౦'తో సిద్ధమవుతున్న సంకేతాలు పంపారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు కురుక్షేత్ర సంగ్రామంలాంటివి

- మొదటి పేజి తరువాయి

ప్రయోగం, అక్రమ కేసులను ఎదుర్కొని వైసీపీ కార్యకర్తలు గట్టిగా నిలబడాలని పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ఈరోజు నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల పేరిట చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల వెనుక స్థానిక ఎన్నికలను తప్పించుకునే కుట్ర ఉందనే అనుమానాలు ఉన్నాయన్నారు.సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 44 లక్షల ఓట్లు గల్లంతయ్యాయని ప్రభుత్వ వర్గాలే చెబుతున్నాయంటే, ఎన్నికలు ఏ రీతిలో సజావుగా జరుగుతాయో అర్థం చేసుకోవచ్చని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు సీఎంగా ఉన్నంత కాలం పారదర్శక ఎన్నికలు సాధ్యం కావని... నిత్యం ఏదో ఒక డ్రామా ఆడుతూ, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు.గతంలో 23 మంది వైసీపీ ఎమ్మెల్యేలను తీసుకెళ్లిన చంద్రబాబుకు 2019 ఎన్నికల్లో ప్రజలు అదే 23 సీట్లకు పరిమితం చేసి గుణపాఠం చెప్పారని గుర్తుచేశారు. దౌర్జన్యాలు, అబద్ధాలు ఎల్లకాలం సాగవని, రాబోయే స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలకు పార్టీ పూర్తి అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## 'ఎంత ధైర్యం?'.. విద్యార్థికి నోటీసులపై సుప్రీంకోర్టు ఆగ్రహం

నిరసనలో పాల్గొన్న ఓ న్యాయ విద్యార్థికి నోటీసులు జారీ చేయడంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. విద్యార్థులపై చర్యలు తీసుకోవద్దని సెప్టెంబర్ 1న దేశవ్యాప్తంగా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా.. న్యాయ విద్యార్థికి గ్రేటర్ నోయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసులు ఇవ్వడాన్ని తప్పుపట్టింది. ఆ నోటీసులను తర్వాత ఉపసంహరించుకున్నప్పటికీ.. ఈ వ్యవహారం చాలా తీవ్రమైనదని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది.కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో పాల్గొన్నందుకు విద్యార్థికి ఈ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఈ విషయం బుధవారం సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం దృష్టికి వచ్చింది. "మేజిస్ట్రేట్ నోటీసులు ఇచ్చే ధైర్యం ఎలా చేశారు? ఏ విద్యార్థిపైనా బలవంతపు చర్యలు తీసుకోవద్దని మేం స్పష్టంగా చెప్పాం. ఆ ఆదేశాలను ఏ మేజిస్ట్రేట్ ఉల్లంఘించకూడదు" అని సీజేఐ వ్యాఖ్యానించారు.ఇదే సమయంలో విద్యార్థి కార్యకర్త ఆకృతి చౌధరిపై 'జాతీయ భద్రతా చట్టం' (ఎన్ఎస్ఏ) ప్రయోగించిన విషయంలో అలహాబాద్ హైకోర్టు కూడా యూపీ అధికారులను తీవ్రంగా మందలించింది. అధికారుల చర్యల వల్ల ఉత్తరప్రదేశ్ 'ఆర్వెలియన్ డిస్టోపియా'గా మారే పరిస్థితి వస్తుందని హెచ్చరించింది. అధికారులు తమ విధేయత రాజ్యాంగం పట్ల ఉండాలి తప్ప రాజకీయ నేతల పట్ల కాదని స్పష్టం చేసింది.

నోయిడా డిస్ట్రిక్ మెజిస్ట్రేట్ మేధా రూపమ్ ఆమోదించిన ఆకృతి చౌధరి ఎన్ఎస్ఏ నిర్బంధాన్ని సెప్టెంబర్ 2న హైకోర్టు కొట్టివేసింది. ఆమెకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. నిరసనకు సంబంధించిన కేసుల్లో తగిన ఆధారాలు లేకుండానే కఠినమైన ఎన్ఎస్ఏను ప్రయోగించడంపై గౌతమ్ బుద్ధ నగర్ జిల్లా యంత్రాంగం, పోలీసులపై ధర్మాసనం మండిపడింది.

## 53 రోజులు జైల్లో చంద్రబాబు.. 53 కొవ్వొత్తులు వెలిగించిన నారా లోకేశ్

- మొదటి పేజి తరువాయి

ఆరోపించారు. ఆ కేసులో చంద్రబాబును 53 రోజుల పాటు అక్రమంగా జైలులో నిర్బంధించారని ఆయన పేర్కొన్నారు. ఆ చీకటి రోజులకు గుర్తుగా, నాటి నిర్బంధాన్ని నిరసిస్తూ 53 కొవ్వొత్తులు వెలిగించినట్లు లోకేశ్ వివరించారు.నాటి సంఘటన ప్రజాస్వామ్యానికే చీకటి రోజు అని, అయితే చివరికి నిజమే గెలిచిందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ప్రజల ఆశీర్వాదంతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడమే దీనికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు.

## ధరల పెరుగుదలను నిరసిస్తూ సిపిఐ వినూత్న నిరసన కార్యక్రమం



**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 9,**
ప్రజల కొనుగోలు శక్తి రోజు రోజుకి తగ్గుతున్న క్రమాన్ని నిరసిస్తూ కూటమిపాలనలో ఆకలి చావులకు గురవుతున్న ప్రజలను ఆదుకోవాలని,అధిక ధరలను తగ్గించాలని భారత కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సిపిఐ గుంటూరు నగర సమితి ఆధ్వర్యంలో నేడు కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్ నుండి హిమని సెంటర్లో గల మహాత్మా గాంధీ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించడం జరిగింది. అనంతరం ఈ కూటమి పరిపాలనలో ప్రజలు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను,అధిక ధరల ప్రభావాన్ని ప్రతిబింబించే విధంగా వినూత్న రీతిలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు గుంటూరు జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్, నగర కమిటీ సభ్యులు నూతలపాటి చిన్న, జి సురేష్ బాబు, మంగా శ్రీనివాస్ రావు,బి వెంకటేశ్వర రెడ్డి, గుండెబోయిన లక్ష్మి, వలి, శశి, చల్లా మరియా దాస్, ఆకిటి రామచంద్రుడు, రాయల వెంకటేశ్వర్లు సుశీల, పద్మ, భారతి పద్మ, అప్పమ్మ, మొహిద్దీన్ పీరా, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.


# పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల


## చంద్రబాబు అరెస్టు ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయం రాచకొండ లక్ష్మయ్య

**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 9:**
టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని నాటి వైసీపీ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా టీడీపీ గుంటూరు జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య తీవ్రంగా స్పందించారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే చంద్రబాబును అరెస్టు చేసి 53 రోజులు జైల్లో ఉంచారని ఆరోపించారు.
2023 సెప్టెంబర్ 9న నంద్యాలలో చంద్రబాబును అరెస్టు చేసిన ఘటనను తెలుగు ప్రజలు ఎన్నటికీ మరిచిపోలేరని అన్నారు. అర్ధరాత్రి నుంచి పోలీసులు వ్యవహరించిన తీరు, బస్సులో ఉన్న చంద్రబాబును అరెస్టు చేసిన విధానం ప్రజాస్వామ్య విలువలను ప్రశ్నించేలా ఉన్నాయని పేర్కొన్నారు. అరెస్టు అనంతరం కోర్టుకు తరలిస్తున్న సమయంలో చంద్రబాబు కిటికీ వైపు చూస్తూ కూర్చున్న దృశ్యం ప్రజల మనసుల్లో ఇప్పటికీ నిలిచిపోయిందన్నారు. ప్రజలే తన జీవితంగా భావించే చంద్రబాబు నేడు కూడా ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు.
చంద్రబాబు అరెస్టు తెలుగు ప్రజల్లో ఐక్యతను, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాట స్ఫూర్తిని పెంచిందని లక్ష్మయ్య అన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం చంద్రబాబు చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.





## ఎన్నారై టీడీపీ కేంద్ర కమిటీ సభ్యుల
# ప్రమాణ స్వీకారం






**గుంటూరు : పెన్ పవర్, సెప్టెంబర్, 9,**
నూతనంగా ఎన్నికైన ఎన్నారై తెలుగుదేశం పార్టీ కేంద్ర కమిటీకి చెందిన 45 మంది సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా జరిగింది. విద్య, సమాచార సాంకేతిక శాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ ప్రపంచంలోని అనేక దేశాల్లో తెలుగువారు ఉన్నారని, తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని కాపాడిన ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. 2024 ఎన్నికల్లో ఎన్నారైలు కీలక పాత్ర పోషించారని, చంద్రబాబు అరెస్టు సమయంలో 55 దేశాల్లోని ఎన్నారైలు నిరసన గళం వినిపించారని తెలిపారు.విదేశాల్లో ఉన్నప్పటికీ తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతున్న ఎన్నారైలను అభినందించారు. “మీరు ఎన్నారైలు కాదు.. అత్యంత విశ్వసనీయ భారతీయులు” అని లోకేష్ పేర్కొన్నారు. ప్రతి పది మంది ఎన్నారైల సమూహంలో ఒక తెలుగుదేశం పార్టీ సభ్యుడు ఉండేలా కృషి చేయాలని సూచించారు.డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ దూరం పెరిగినా దేశభక్తిని, దేశం మారినా తెలుగుదేశం పార్టీ జెండాను ఎన్నారైలు వీడలేదన్నారు. 2024 ఎన్నికల్లో ఎన్నారైలు చేసిన సేవలు మరువలేనివని, వారికి ప్రత్యేక స్థానం కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందన్నారు. నూతన కమిటీ సభ్యులు విదేశాల్లోని తెలుగువారితో సత్సంబంధాలు కొనసాగిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.కేంద్ర కమిటీ అధ్యక్షుడు గురు రాజా మాట్లాడుతూ తనకు పదవి కంటే విదేశాల్లోని తెలుగువారి ఆలోచనలు, ఆకాంక్షలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత లభించిందన్నారు. తెలుగుదేశం పార్టీ విజయమే తెలుగు రాష్ట్ర ప్రజలకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యురాలు కావలి గ్రీష్మ, నిర్వహణ కార్యదర్శి చెంచు వేణుగోపాల్ రెడ్డి, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కోమటి జయరాం, ఆంధ్రప్రదేశ్ ఎన్నారై సంఘం అధ్యక్షుడు వేమూరి రవి తదితరులు పాల్గొన్నారు.

## తాగు నీటి చెరువులు నింపాలి జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ




**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 9 :**
ఎల్ నినో ప్రభావం దృష్ట్యా తాగునీటి సరఫరాకు సమస్యలు తలెత్తకుండా తాగు నీటి చెరువులు నింపాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ స్పష్టం చేశారు. తాగు నీటి చెరువుల నిలువలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బుధవారం సమీక్షించారు. నాలుగు రోజులలో తాగు నీటి చెరువులు నింపాలన్నారు. వర్షాధారిత చెరువులు నింపడానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఒగేరువాగు నింపడం ద్వారా దాని పరిధిలో ఉన్న గ్రామాలకు తాగు నీటిని అందించుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 75 శాతం కంటే ఎక్కువ నీరు నింపాల్సిన 50 చెరువులపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు (ఎన్.ఎస్.పి) నుండి వస్తున్న నీరు ఎవరు ఎక్కడా దారి మళ్ళించే చర్యలు చేపట్టకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ పది రోజుల్లో లక్ష్యం మేరకు చెరువులలో నీరు నింపుట జరుగుతుందన్నారు.నాగార్జున సాగర్ ప్రాజెక్టు (ఎన్.ఎస్.పి) నుంచి గుంటూరు చానల్ కు నీరు విడుదల చేయడం ద్వారా దాని కిందన గల చెరువులు నింపుటకు అవకాశం ఉందని జలవనరుల శాఖ ఇంజనీర్లు తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, జలవనరుల శాఖ ఇంజనీర్లు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీర్లు పాల్గొన్నారు.

## స్కిల్ మంథన్ వేదికపై ఎన్టీఆర్ జిల్లా 'రైజ్'కు జాతీయ గుర్తింపు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

**విజయవాడ,పెన్ పవర్,సెప్టెంబరు 9:**
గ్రామీణ మహిళలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పిస్తూ, వారిని నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దుతున్న ఎన్టీఆర్ జిల్లా రూరల్ ఇంక్యుబేషన్, స్కిల్లింగ్ అండ్ ఆంత్రప్రెన్యూర్షిప్ (రైజ్) కార్యక్రమానికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది.కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్కిల్ మంథన్' వెబినార్లో రైజ్ కార్యక్రమాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. మహిళలకు స్థిరమైన జీవనోపాధి కల్పించడం, నైపుణ్యాలను అభివృద్ధి చేసి స్వయం ఉపాధి, పారిశ్రామిక రంగాల వైపు ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.విజయవాడ జిల్లా కలెక్టరేట్ నుంచి వెబినార్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ.. రైజ్ కార్యక్రమానికి లభించిన జాతీయ గుర్తింపు జిల్లా యంత్రాంగం, స్వయం సహాయక సంఘాల మహిళలు, భాగస్వామ్య సంస్థల సమష్టి కృషికి దక్కిన ఫలితమన్నారు.ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా 'ఒక కుటుంబంఒక పారిశ్రామికవేత్త' ఆలోచనను ముందుకు తీసుకెళ్లేందుకు గుంటుపల్లిలోని రైజ్ కేంద్రం పనిచేస్తోందన్నారు. నీతి ఆయోగ్, సెర్ప్ తదితర శాఖల సహకారంతో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.రైజ్ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా అమలు చేసి ఎన్టీఆర్ జిల్లాను మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధిలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఏఎన్వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.



## పొలం పిలుస్తోంది కార్యక్రమం




**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 9**
గూడూరు మండలం కాంచకోడూరు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఏవో జి. శివరామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆధునిక సాగు పద్ధతులు, ఎరువుల వినియోగం, చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని ఏవో శివరామకృష్ణ సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## గుంటూరులో రికార్డు స్థాయి మట్టి విగ్రహాల తయారీ కమిషనర్ కె. మయూర్ అశోక్






**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 9:**
గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 11న ఏకకాలంలో 25 వేల మంది విద్యార్థులతో గ్రీన్ గణేష్ మట్టి వినాయక విగ్రహాల తయారీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు.నగరంలోని సుమారు 60 పాఠశాలల్లో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు విద్యార్థులు స్వచ్ఛందంగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సులో నమోదు చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు.ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వల్ల భూమి, నీరు, గాలి కలుషితమవుతున్నాయని, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడమే గ్రీన్ గణేష్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు.జీఎంసీ అందించే విత్తనాలు కలిపిన మట్టితో విద్యార్థులు తమ పాఠశాల ప్రాంగణంలోనే విగ్రహాలు తయారు చేయాలని సూచించారు. పాల్గొనే ప్రతి విద్యార్థికి, పాఠశాలకు జీఎంసీ తరఫున అభినందన సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు.
విద్యార్థులను బలవంతంగా కాకుండా స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొనేలా పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలని కమిషనర్ కోరారు.కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించేందుకు కమిషనర్ ఎన్టీఆర్ స్టేడియాన్ని సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ జి. సాంబశివరావు, డిప్యూటీ కమిషనర్లు, వైద్య, ఇంజినీరింగ్, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి



**పెడన, పెన్ పవర్, సెప్టెంబర్ 9**
పెడన పట్టణంలోని పలు సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ డి. కొండయ్య బుధవారం సందర్శించి నూతన పెన్షన్ ప్రక్రియ అమలును పరిశీలించారు. పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ, వివరాల నమోదు, అర్హతల పరిశీలన తదితర అంశాలను సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పెన్షన్ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సమాచారం అందిస్తూ, దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని కమిషనర్ సూచించారు.

# పాఠశాలల్లో ఎంఈఓల ఆకస్మిక తనిఖీలు



పెడన, పెన్ పవర్, సెప్టెంబర్ 9
పెడన మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మడక గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ1 ఎన్. సలోమి సందర్శించి పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, బోధన తీరును పరిశీలించారు. అలాగే పెడన పట్టణంలోని 23వ వార్డులో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ2 వై.వి. హరనాథ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా ఉపాధ్యాయులు బాధ్యతగా విధులు నిర్వహించాలని అధికారులు సూచించారు.

# విగ్రహాలను నిర్దేశించిన ప్రదేశాల్లో నిమజ్జనం చేయాలి

## జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ



గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 9 : విగ్రహాలను నిర్ణయించిన నిర్దేశిత ప్రత్యేక నిమజ్జన ప్రదేశాల్లో మాత్రమే నిమజ్జనం చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి మార్గదర్శకాలను జారీ చేసిందని, వాటిని పాటించి పర్యావరణ హితానికి తోడ్పాటును అందించాలని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు.సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించిన అనంతరం విగ్రహాలను జలాశయాలు, నీటి వనరుల్లో నిమజ్జనం చేయడం జరుగుతుందని, తద్వారా నీటి నాణ్యత దెబ్బతింటుండటం ఆందోళనకరమైన అంశంగా ఉందన్నారు. క్లాస్-1 నగరాల పరిధిలో నీటి వనరుల నీటి నాణ్యతను మూడు దశల్లో - నిమజ్జనానికి ముందు, నిమజ్జనం జరుగుతున్న సమయంలో, నిమజ్జనం అనంతరం పర్యవేక్షించి అంచనా వేయాలని సూచించడం జరిగిందని వివరించారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాల్లో ముఖ్యంగా పర్యావరణహిత విగ్రహాలను ఉపయోగించాలన్నారు. రంగులు వినియోగిస్తే పర్యావరణ హితరంగులు మాత్రమే వినియోగించాలని అన్నారు. అవసరమైన సౌకర్యాలతో తాత్కాలికంగా ప్రత్యేక నిమజ్జన కొలనులను ఏర్పాటు చేయవచ్చని చెప్పారు. వినాయక మండపాలు నిర్వహించే వర్గాలతో సహా ప్రజలకువిస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. విగ్రహాల నిమజ్జనం సందర్భంగా నీటి నాణ్యత దెబ్బతినకుండా నివారించుటకు సి.పి.సి.బి మార్గదర్శకాలను అమలు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# ధరల పెరుగుదలపై సీపీఐ ధర్నా







**పెన్ పవర్ కారంపూడి సెప్టెంబర్ :- 9**

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను నియంత్రించి సామాన్య ప్రజలపై పడుతున్న భారాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కారంపూడి మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం బస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి షేక్ సైదా మాట్లాడుతూ ధరలు పెరుగుతున్నా ప్రజల ఆదాయం మాత్రం పెరగడం లేదని, దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. రోజువారీ అవసరాలైన బియ్యం, పప్పులు, వంటనూనెలు, కూరగాయలు తదితర వస్తువుల ధరలు సామాన్యులకు అందనంత స్థాయికి చేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో రవాణా ఖర్చులు పెరిగి, దాని ప్రభావం నిత్యావసర వస్తువులపై పడుతోందన్నారు. ఒకవైపు సరుకుల ధరలు పెరుగుతుండగా మరోవైపు వంటగ్యాస్ ధరలు కూడా కుటుంబాల నెలవారీ బడ్జెట్‌ను దెబ్బతీస్తున్నాయని తెలిపారు. ప్రజలపై పన్నులు, ధరల భారాన్ని మోపడం కాకుండా, ప్రభుత్వాలు తక్షణమే జోక్యం చేసుకుని నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ధరల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవడంతో పాటు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను తగ్గించాలని కోరారు.ప్రజల సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని, ధరలు తగ్గించే వరకు ప్రజల పక్షాన ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని షేక్ సైదా హెచ్చరించారు.అనంతరం బస్టాండ్ సెంటర్ నుంచి సీపీఐ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావును కలిసి ప్రజల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో సీపీ ఐ మండల సహాయ కార్యదర్శి మేకపోతు చిన్న కోటిరెడ్డి, పట్టణ కార్యదర్శి సూరె హనుమంతరావు, గాలం శ్రీను, నూనె వెంకటేశ్వర్లు, వరలక్ష్మి, జాన్ బి, సైదా బి పాల్గొన్నారు.

# జనసేన స్థానిక ఎన్నికల అవగాహన కార్యక్రమం



**గుంటూరు: పెన్ పవర్, సెప్టెంబర్, 9,**

తాడేపల్లిలోని అన్నపూర్ణ కన్వెన్షన్‌లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ పార్లమెంట్ నియోజకవర్గాలకు చెందిన స్థానిక సంస్థల ఎన్నికల కో-ఆర్డినేటర్లు, కోఆర్డినేషన్ టీమ్, సపోర్ట్ టీమ్ సభ్యులు కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సమావేశానికి అవనిగడ్డ ఎమ్మెల్యే, జనసేన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల మచిలీపట్నం, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గాల సమన్వయ కమిటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ హాజరయ్యారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విధివిధానాలు, క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన వ్యూహాలు, పార్టీ శ్రేణుల సమన్వయం, ఎన్నికల నిర్వహణకు చేపట్టాల్సిన కార్యాచరణపై సమావేశంలో చర్చించారు. స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులను క్షేత్రస్థాయిలో మరింత సన్నద్ధం చేయడంపై నాయకులు ప్రత్యేకంగా దృష్టి సారించారు.

# 9వ జాతీయ పోషణ మాసం ప్రారంభోత్సవం



**వేటపాలెం, సెప్టెంబర్ 9, (పెన్ పవర్) :**

వేటపాలెం ప్రాజెక్టు మీటింగ్ హాల్‌లో బుధవారం 9వ జాతీయ పోషణ మాసం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వెబ్‌లింక్ ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో, ఎంఈఓ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. పోషకాహారం, ఆరోగ్యం, చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషణపై అవగాహన కల్పించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఈ సందర్భంగా అవగాహన పొందారు.

# చంద్రబాబు అరెస్ట్ అక్రమం.. ప్రజలు అప్పుడే తిరస్కరించారు: ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 09:**

మూడేళ్ల క్రితం సరిగ్గా ఇదే రోజున ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని అన్యాయంగా అరెస్ట్ చేసి 53 రోజులు జైలులో ఉంచారని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. నేడు ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఎంపీ లేని కేసును ఉన్నట్లు సృష్టించి ఆనాడు చంద్రబాబు ని అరెస్ట్ చేసి అక్రమంగా జైల్లో ఉంచారన్నారు. ఆ సమయంలో తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారు ఈ అరెస్టును తీవ్రంగా వ్యతిరేకించారని తెలిపారు. 2024 ఎన్నికల్లో ప్రజలు కులం, మతం, ప్రాంతాలకు అతీతంగా ఆలోచించి.. జరిగినది న్యాయమా? అన్యాయమా? రాష్ట్రానికి ఎవరు అభివృద్ధి, సంక్షేమం అందించగలరనే అంశాలను పరిగణనలోకి తీసుకుని కూటమికి అద్భుతమైన విజయాన్ని అందించారని పేర్కొన్నారు. రాబోయే 2029 ఎన్నికల్లోనూ ఇదే




తరహా ప్రజా తీర్పు పునరావృతమవుతుందని ఎంపీ ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలవరం ప్రాజెక్టు, అమరావతికి చట్టబద్ధత, రాష్ట్రానికి గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ వంటి కీలక పెట్టుబడులు, ప్రాజెక్టులను సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదే సమయంలో సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.రూ.4 వేల పెన్షన్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలను అమలు చేస్తూ దాదాపు 90 శాతం మేర సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వెల్లడించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగించాలంటే రాష్ట్రానికి సుస్థిరమైన ప్రభుత్వం అవసరమని ఎంపీ అన్నారు. ఇతర రాష్ట్రాల్లో పదేళ్ల పాటు ఒకే ప్రభుత్వం కొనసాగినప్పుడు దీర్ఘకాలిక అభివృద్ధి సాధ్యమైనట్లే.. ఆంధ్రప్రదేశ్‌లోనూ సుస్థిర పాలనతో మరింత అభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేసే నాయకత్వానికి ప్రజలు అండగా నిలవాలని, అభివృద్ధి-సంక్షేమాన్ని కొనసాగించేందుకు కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని ఎంపీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అధిక ధరలకు అడ్డుకట్ట వేయాలి నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించి రైతులకు ఐదు లక్షల రుణమాఫీ అమలు చేయాలి:అధిక ధరలకు అడ్డుకట్ట వేయాలని సీపీఐ నాయకులు నిరసన ర్యాలీ







**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 09:**

నరసరావుపేట, పల్నాడు జిల్లాఅధిక ధరలకు అడ్డుకట్ట వేయాలి రైతులకు ఐదు లక్షల రుణమాఫీ ప్రకటించాలి: సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబునిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను అరికట్టాలని, బ్లాక్ మార్కెట్‌ను పూర్తిగా నిర్మూలించాలని, రైతులకు ఐదు లక్షల రూపాయల రుణమాఫీ ప్రకటించాలని సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు డిమాండ్ చేశారు.సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు బుధవారం నరసరావుపేటలో స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కాసా రాంబాబు మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ధరల భారంతో సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతింటున్నాయని అన్నారు. ఎన్నికల సమయంలో ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీలను విస్మరించాయని విమర్శించారు.

పెద్ద పారిశ్రామిక వర్గాలకు లక్షల కోట్ల రూపాయల రాయితీలు ఇస్తూ, సామాన్య ప్రజలపై భారాలు మోపుతున్నారని ఆరోపించారు. ప్రజల ఆదాయానికి, పెరుగుతున్న ఖర్చులకు ఎలాంటి పొంతన లేకపోవడంతో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.పప్పులు, వంటనూనెలు, పాలు, చక్కెర, ఉప్పు తదితర నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, బియ్యం ధర కూడా కిలోకు 75 రూపాయల వరకు చేరడంతో సామాన్య కుటుంబాల బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం పడుతోందని అన్నారు. ధరల దోపిడీని అరికట్టి ప్రజలకు అందుబాటు ధరల్లో నిత్యావసర వస్తువులు లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు ఐదు లక్షల రూపాయల వరకు రుణమాఫీ ప్రకటించాలని, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని, బ్లాక్ మార్కెట్ కార్యకలాపాలను అరికట్టాలని కోరుతూ ఆర్డీవోకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణ రాజు, సీనియర్ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, మండల కార్యదర్శి రొడ్డ అంజిరెడ్డి, నాయకులు సీహెచ్ నాగేశ్వరరావు, యు. రాజు, అంకమ్మరావు, అబ్రహం, నాగరాజు, కోటయ్య, గోపి, శ్రీనివాస్ రెడ్డి, అచ్యుత్ రెడ్డి, చంద్రపాల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహిద్దాం.

## - వినాయక మండపాలు, విగ్రహాల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తప్పనిసరి అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి.

**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 09:**

వినాయక మండపాలు, విగ్రహాల ఏర్పాటుకు ముందస్తు అనుమతి తప్పనిసరి. సింగిల్ విండో విధానంలో అనుమతుల ప్రక్రియ మరింత సులభతరం. ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం ప్రత్యేక పోర్టల్ అందుబాటులోకిజిల్లాలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా వినాయక మండపాలు, విగ్రహాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా ముందస్తు అనుమతులు పొందాలని బుధవారం పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ఐపీఎస్ తెలిపారు. ప్రజల సౌకర్యార్థం అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసి, సరళతరం చేసేందుకు సింగిల్ విండో విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఈ విధానం ద్వారా పోలీస్, అగ్నిమాపక, మున్సిపల్ లేదా గ్రామ పంచాయతీ, విద్యుత్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన అనుమతులను ఒకే వేదికపై పూర్తిగా ఉచితంగా పొందవచ్చని తెలిపారు. నిర్వాహకులు




ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకుని అవసరమైన పత్రాలను సమర్పించాలని సూచించారు.దరఖాస్తు పరిశీలన అనంతరం సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి అనుమతులు మంజూరు చేస్తారని తెలిపారు. అనుమతి మంజూరైన తర్వాత డిజిటల్ అనుమతి పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకుని మండపం వద్ద అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. మండపాల ఏర్పాటు సమయంలో ప్రజల రాకపోకలకు, అత్యవసర సేవలకు ఎటువంటి అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు ఎస్పీ తెలిపారు. విద్యుత్ భద్రత, అగ్నిమాపక పరికరాలు, తగిన వెలుతురు, పారిశుధ్య ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ముఖ్యమైన మండపాల వద్ద నిఘా పరికరాలు ఏర్పాటు చేయడంతో పాటు బాధ్యతాయుతమైన స్వచ్ఛంద సేవకులను నియమించాలని కోరారు.ధ్వని విస్తరణ పరికరాలు, సంగీత వ్యవస్థల వినియోగానికి ముందస్తు అనుమతి తప్పనిసరి అని తెలిపారు. శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, నిర్దేశిత సమయాల తర్వాత లౌడ్‌స్పీకర్ల వినియోగం చేయరాదని హెచ్చరించారు.విగ్రహ నిమజ్జన కార్యక్రమాలు అధికారికంగా గుర్తించిన ప్రదేశాల్లోనే నిర్వహించాలని సూచించారు. నదులు, కాలువలు, చెరువులు, తాగునీటి వనరులు వంటి నిషేధిత ప్రాంతాల్లో నిమజ్జనాలు చేపట్టరాదన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన భద్రతా ఏర్పాట్లు, అత్యవసర సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలు, అనధికారిక ఊరేగింపులు, నిబంధనల ఉల్లంఘనలు జరిగితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు ఎస్పీ హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని మట్టి వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపనకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరిస్తూ నియమ నిబంధనలు పాటించి వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించాలని అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ఆకాంక్షించారు.

# విద్యార్థుల భద్రతే లక్ష్యం.. మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, ర్యాగింగ్‌పై అప్రమత్తంగా ఉండాలి

## -మహిళా పోలీస్ స్టేషన్ సీఐ అశోక్ బాబు

## -ఎన్ఈసీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 09:**

ఎన్ఈసీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమంమాదక ద్రవ్యాల నిర్మూలన, మహిళల భద్రత, సైబర్ నేరాలు, ర్యాగింగ్, రోడ్డు భద్రతపై సూచనలు. పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ఐపీఎస్ ఆదేశాల మేరకు బుధవారం నరసరావుపేటలోని ఎన్ఈసీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు బాలికల, మహిళల భద్రత, మాదక ద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, ర్యాగింగ్ నివారణ, మానవ అక్రమ రవాణా నిరోధక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ తాళ్లూరి అశోక్ బాబు మాట్లాడుతూ విద్యాసంస్థల్లో శాంతియుత, సురక్షిత వాతావరణాన్ని కాపాడటం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబాలు, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు అలవాటు పడిన యువత నేరాల వైపు మళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తల్లిదండ్రులు,







ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి సారించి వారి భవిష్యత్తు నిర్మాణానికి తోడ్పడాలని సూచించారు. ఎవరైనా మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్నా లేదా వినియోగిస్తున్నా వెంటనే పోలీసులకు లేదా టోల్ ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందించాలని కోరారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాల గురించి వివరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు సూచించారు.

సైబర్ నేరాలపై మాట్లాడుతూ డిజిటల్ అరెస్ట్, ఉద్యోగ మోసాలు, కేవైసీ మోసాలు, పెట్టుబడి మోసాలు వంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బ్యాంకు ఖాతాలకు సంబంధించిన ఓటీపీలు, వ్యక్తిగత వివరాలు ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 సహాయ సంఖ్యకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, సంబంధిత వివరాలను సైబర్ నేరాల పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు.మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తి యాప్ వినియోగంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ యాప్ ద్వారా తక్షణ సహాయం పొందవచ్చని వివరించారు. ర్యాగింగ్ చట్టవిరుద్ధమైన చర్య అని, కొత్త విద్యార్థులను వేధించడం, అవమానించడం, బెదిరించడం వంటి చర్యలు తీవ్రమైన నేరాలుగా పరిగణించబడతాయని హెచ్చరించారు. విద్యాసంస్థల యాజమాన్యాలు ర్యాగింగ్ నిరోధక కమిటీలను చురుకుగా నిర్వహిస్తూ విద్యార్థులకు సురక్షిత వాతావరణం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రతినిధులు, సఖి కేంద్రం సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు, ఉప ప్రిన్సిపాల్ డి. సునీల్, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది మరియు సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆధారాలతో కమ్మర తెగ నాయకుల వివరణ

## ఎస్టీ హోదాపై ఆరోపణలను పరిశీలించాలని వినతి

**చీరాల, సెప్టెంబరు 9 (పెన్ పవర్):**

చీరాల పట్టణంలో నివసిస్తున్న కమ్మర తెగ కుటుంబాలు ఎస్టీ కాదంటూ వచ్చిన ఆరోపణలను కమ్మర తెగ ఎస్టీ సంఘం నాయకులు ఖండించారు. ఈ మేరకు బుధవారం చీరాల ఆర్డీఓ ఎస్. నరసింహారావును కలిసి వినతిపత్రం అందజేశారు.కమ్మర తెగకు సంబంధించిన వివరాలు, ప్రభుత్వ రికార్డులు, తమ వర్గానికి ఉన్న ఎస్టీ హోదాకు సంబంధించిన ఆధారాలను ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లినట్లు నాయకులు తెలిపారు. తమపై వచ్చిన ఆరోపణలను సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని కోరారు.సంబంధిత రికార్డులు, ఆధారాలను పరిశీలించి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ ఎస్. నరసింహారావును విజ్ఞప్తి చేశారు.



# స్వచ్ఛ వాయు సర్వేక్షన్ అవార్డు నగర ప్రజలకు గర్వకారణం జనసేన నేతలు



గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 9,
కేంద్ర పర్యావరణ, అటవీశాఖ విడుదల చేసిన స్వచ్ఛ వాయు సర్వేక్షన్ 2026 లో గుంటూరుకు రెండో స్థానం రావటం గుంటూరు నగర ప్రజలకు గర్వకారణమని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. ఉత్తరప్రదేశ్ లోని హరిత భవన్ లో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో అధికారుల చేతుల మీదుగా అవార్డు తీసుకున్న గుంటూరు నగరపాలక సంస్థ కమీషనర్ మయూర్ అశోక్ ని బుధవారం అయన ఛాంబర్ లో జనసేన నేతలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ గుంటూరు ప్రజలకు దేశ స్థాయిలో మంచి గుర్తింపు తీసుకొచ్చిన ప్రభుత్వానికి అధికారులకు , సహకరించిన ప్రజలకు అభినందనలు తెలిపారు. వాతావరణంలో వస్తున్న విపరీత మార్పుల నుంచి రక్షణ పొందాలంటే పర్యావరణ పరిరక్షణను ఒక ఉద్యమంలా చేపట్టాలన్నారు. పచ్చని చెట్లను విరివిగా నాటడమే కాకుండా వాటిని సంరక్షణను కూడా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. వాయు కాలుష్యాన్ని నియంత్రణను ప్రతీ ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని కోరారు. సిగ్నల్స్ దగ్గర వాహనాలు ఆపినప్పుడు ఇంజన్ ఆపుచేయాలని దీనిద్వారా ఇంధనం ఆదా కావటమే కాకుండా కాలుష్య ఉద్గలను తగ్గించవచ్చున్నారు. స్వచ్ఛమైన గాలితోనే మనిషి ఆరోగ్యం ముడిపడి ఉందని ఆళ్ళ హరి అన్నారు. కార్యక్రమంలో జనసేన నగర కార్యదర్శి మెహబుబ్ భాష తదితరులు పాల్గొన్నారు

# హాజీల ఆరోగ్య భద్రతే లక్ష్యం ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 9,**
పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్) లోని నాట్కో సెంటర్ లో ప్రత్యేక ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 500 మంది హజ్ యాత్రికులకు (హాజీలకు) బుధవారం స్థానిక జీజీహెచ్ లో ఉచితంగా టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా సౌదీ అరేబియా ప్రభుత్వం, భారత హజ్ కమిటీ నిబంధనల ప్రకారం ప్రతీ యాత్రికుడు తప్పనిసరిగా వ్యాక్సిన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు ఒకే చోట కలిసే సమయంలో ఇన్ఫెక్షన్లు వ్యాపించకుండా నిరోధించేందుకు ముందస్తుగా వ్యాక్సినేషన్ చేయిస్తున్నామని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో హాజీలకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. హజ్ యాత్రకు వెళ్లే వారికి ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున అందిస్తున్నామన్నారు. గతంలో హైదరాబాద్ నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారని, ఇప్పుడు గన్నవరం నుంచే వెళ్లేలా ఏర్పాటు చేశారని చెప్పారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ జీ దుర్గాప్రసాద్, వైద్యులు పాల్గొన్నారు.

# 37 పతకాలు సాధించిన క్రీడాకారులకు ఎస్పీ వకుల్ జిందాల్ అభినందనలు



గుంటూరు: పెన్ పవర్, సెప్టెంబర్, 9,
రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్2026లో గుంటూరు జిల్లా పోలీస్ క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఏకంగా 37 పతకాలు సాధించారు. వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ చాటి గుంటూరు జిల్లా పోలీసులకు ఘనత తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బుధవారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో పతకాలు సాధించిన క్రీడాకారులు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మర్యాదపూర్వకంగా కలిసి తమ విజయాలను తెలియజేశారు. క్రీడాకారులను ఎస్పీ అభినందిస్తూ, క్రీడల్లో మరింత రాణించి భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడాకారుల ప్రతిభ పోలీస్ శాఖకు గర్వకారణమని పేర్కొన్నారు.

# ఆల్ ఇండియా స్టూడెంట్స్ యూనియన్ బాపట్ల జిల్లా నూతన కమిటీ నియామకం


**- విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడాలి**
**- నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేసిన రాష్ట్ర కార్యదర్శి మణిదీప్**



**చీరాల, సెప్టెంబర్ 9 (పెన్ పవర్) :**
చీరాల రోటరీ క్లబ్ కార్యాలయంలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ యూనియన్ బాపట్ల జిల్లా నూతన కమిటీ నియామక కార్యక్రమం జిల్లా అధ్యక్షులు వడ్లమూడి సాయి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి మణిదీప్ హాజరై నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు.
ఈ సందర్భంగా మణిదీప్ మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఆల్ ఇండియా స్టూడెంట్స్ యూనియన్ నిరంతరం పోరాడాలని సూచించారు. విద్యార్థుల హక్కులు, సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. నూతన కమిటీలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆవుల యజ్ఞేశ్, జిల్లా కార్యదర్శులుగా సలగల మహేంద్ర, కొండేపి దుర్గాప్రసాద్, జాయింట్ సెక్రెటరీలుగా చుక్క మణికంఠ, తెల్ల అనిల్, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జిగా గవిని మణికంఠ, చీరాల అధ్యక్షుడిగా సైదా వలి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎలుక దేవరాజు నియమితులయ్యారు. నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థుల హక్కుల పరిరక్షణకు, వారి సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేస్తామని తెలిపారు.

# రైతుల భూ హక్కులకు భరోసా

**రీ-సర్వే పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ**
**- సాంకేతిక పరిజ్ఞానంతో భూ రికార్డులకు శాశ్వత రక్షణ**
**- నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు**





నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 09:
రీ-సర్వే ద్వారా రైతుల భూ హక్కులకు మరింత భద్రత కల్పించడంతో పాటు భవిష్యత్‌లో భూ వివాదాలకు అవకాశం లేకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. బుధవారం నరసరావుపేట మండలం రావిపాడు గ్రామంలో రీ-సర్వే అనంతరం రూపొందించిన పట్టాదారు పాస్‌పుస్తకాల (భూ హక్కు పత్రాల) పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రీ-సర్వే ద్వారా భూ రికార్డులను ఆధునీకరించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ప్రస్తుతం 8,234 గ్రామాల్లో 36 లక్షలకు పైగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేయగా, మిగిలిన 8,582 గ్రామాల్లో మరో 56 లక్షలకు పైగా పాస్‌పుస్తకాలను పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. గత ప్రభుత్వం సొసైటీ బ్యాంకుల్లో లోన్ల రూపంలో మార్టిగేజీగా ఉన్న రైతుల భూములను సైతం నాబార్డుకు తాకట్టు పెట్టిందనిఅన్నారు. ఆ తాకట్టు ని రైతులు డబ్బులు చెల్లించి విడిపించుకోవాలన్నా కుదరటం లేదని అన్నారు. అటువంటి దుర్మార్గపు చర్యలను కూటమి ప్రభుత్వం సరి చేసుకుంటూ ముందుకు సాగుతుందని అన్నారు. నరసరావుపేట నియోజకవర్గంలో పేదల వైద్యసాయానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్), ఎల్ఓసీల ద్వారా గణనీయమైన సహాయం అందించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులు పంటల సాగులో ప్రభుత్వ సూచనలను పాటిస్తూ నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజల మద్దతు ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో రూపొందించిన భూ రికార్డులు అప్పటి సాంకేతిక పరిజ్ఞానం, కొలత విధానాల ఆధారంగా తయారయ్యాయని తెలిపారు. ప్రస్తుతం చేపట్టిన రీ-సర్వేలో ఆధునిక సర్వే సాంకేతికత, జియో-కోఆర్డినేట్ల ఆధారంగా భూముల కొలతలు, హద్దుల నిర్ధారణ చేపడుతున్నట్లు వివరించారు.
కొత్త విధానంలో ప్రతి భూ విస్తీర్ణానికి సంబంధించిన వివరాలను డిజిటల్ రికార్డుల్లో నమోదు చేసి, భూ హక్కులను మరింత పటిష్టం చేయడమే లక్ష్యమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రీ-సర్వే ద్వారా ప్రతి భూ పార్సెల్‌కు ప్రత్యేక గుర్తింపు కల్పించి, భూ రికార్డులను వెబ్‌ల్యాండ్‌తో అనుసంధానం చేసే ప్రక్రియ కొనసాగుతోంది. కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాల్లో క్యూఆర్ కోడ్‌తో పాటు భూమికి సంబంధించిన కొలతలు, భౌగోళిక వివరాలు పొందుపరచడం వల్ల భూ రికార్డుల పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. భవిష్యత్‌లో రెవెన్యూ సేవలను మరింత సులభతరం చేసి, భూ బదలాయింపు వంటి ప్రక్రియలను సాంకేతికత ఆధారంగా వేగంగా నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. రీ-సర్వే అనంతరం జరిగిన భూ లావాదేవీలు కొత్తపాస్‌పుస్తకంలో ప్రతిబింబించకపోతే రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సంబంధిత పత్రాలతో మ్యుటేషన్‌కు దరఖాస్తు చేస్తే రికార్డులను నవీకరించి కొత్త పాస్‌పుస్తకం జారీ చేస్తామని తెలిపారు. పాస్‌పుస్తకాల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే గ్రామ సచివాలయంలోని రెవెన్యూ సిబ్బందికి తెలియజేస్తే వాటిని పరిశీలించి సరిచేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, రెవెన్యూ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# నీటి దుర్వినియోగాన్ని అరికట్టి.. తాగునీటిని పొదుపుగా వినియోగించాలి

**- తాగునీటి చెరువుల నింపుదలకు మరో 10 రోజులు సాగర్ జలాలు విడుదల చేయాలి**
**- నకరికల్లు మంచినీటి చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు**





**నరసరావుపేట,పెన్ పవర్ సెప్టెంబర్ 09:**
ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సూచించారు. నాగార్జునసాగర్ కుడి కాలువ ద్వారా తాగునీటి అవసరాల కోసం విడుదలవుతున్న నీటితో మంచినీటి చెరువులు, కుంటలు, ట్యాంకులను సాధ్యమైనంత మేర నింపుకోవాలని అధికారులను కోరారు. బుధవారం నకరికల్లు సమీపంలోని మంచినీటి చెరువును ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది, ఎన్ఎస్పీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వ, సాగర్ జలాల ప్రవాహం, తాగునీటి అవసరాలపై అధికారులతో చర్చించారు. నాగార్జునసాగర్ కుడి కాలువకు తాగునీటి అవసరాల కోసం గత నెల 26వ తేదీ నుంచి ఎన్ఎస్పీ అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నీటి విడుదల 15 రోజులపాటు, అంటే సెప్టెంబర్ 10వ తేదీ వరకు కొనసాగనుంది. అయితే తక్కువ వర్షపాతం కారణంగా నకరికల్లు మంచినీటి చెరువును పూర్తిస్థాయిలో నింపేందుకు అవసరమైన మేరకు నీరు చేరలేదని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ కుడి కాలువకు మరో 10 రోజులపాటు సాగర్ జలాలను విడుదల చేయాలని ఎమ్మెల్యే ఎన్ఎస్పీ అధికారులను కోరారు. నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలోని మంచినీటి చెరువులు, స్టోరేజీ ట్యాంకులు, ఇతర తాగునీటి వనరులను ముందుగానే నింపుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. తక్కువ వర్షపాతం కొనసాగితే భవిష్యత్‌లో తాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని ఎమ్మెల్యే సూచించారు. రానున్న రోజుల్లో వర్షాలు సమృద్ధిగా కురిస్తేనే తాగునీటి అవసరాలను నిరంతరంగా తీర్చేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తాగునీటి వనరుల పరిస్థితిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్పీ ఎస్ఈ రమేష్, ఈఈ, ఇన్‌చార్జ్ ఈఈ, నరసరావుపేట మున్సిపల్ డీఈ మహమ్మద్ రఫీ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డీఎస్సీ అవకతవకలపై బోడె ప్రసాద్ తీరుపై దేవభక్తుని చక్రవర్తి ఫైర్

**- టీడీపీలో విద్యావంతులు కరువయ్యారు..**
**- ఇంటర్ పాస్ కాని బోడె ప్రసాద్ డీఎస్సీపై మాట్లాడటం విడ్డూరం**



**పెన్ పవర్ కృష్ణా జిల్లా కానూరు సెప్టెంబర్ 09**
పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌పై పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. డీఎస్సీ నియామకాల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదని బోడె ప్రసాద్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీలో విద్యావంతులు కరువయ్యారని, ఇంటర్ పాస్ కాని బోడె ప్రసాద్ డీఎస్సీ వంటి విద్యా అంశాలపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. బోడె ప్రసాద్‌కు డీఎస్సీ పరీక్షలకు, పోలీసులు నిర్వహించే పరీక్షలకు మధ్య తేడా కూడా తెలియదని ఎద్దేవా చేశారు. ఉయ్యూరులో అక్కాచెల్లెళ్లు కానిస్టేబుల్ పరీక్షల్లో అర్హత సాధిస్తే.. వారు డీఎస్సీలో అర్హత సాధించారని బోడె ప్రసాద్ చెబుతున్నారని అన్నారు. కృష్ణాజిల్లాకు చెందిన నవీన్ అనే యువకుడు డీఎస్సీలో అర్హత సాధించినప్పటికీ రెండో జాబితాలో అతని పేరు తొలగించారని ఆరోపించారు.

**స్పోర్ట్స్ కోటాలో అవినీతి జరిగిందని ఆరోపణ**
స్పోర్ట్స్ కోటాలో అవినీతి, అక్రమాలు జరిగాయని దేవభక్తుని చక్రవర్తి ఆరోపించారు. టెట్ పరీక్ష రాయకపోయినా కొందరికి డీఎస్సీలో ఉద్యోగాలు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. డీఎస్సీ నియామకాలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాక్ష్యాలతో సహా పలుమార్లు ఆరోపణలు చేశారని, ప్రభుత్వం వాటిపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించే ధైర్యం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌కు లేదని విమర్శించారు. గతంలో పరిటాల రవి వ్యవహారంలో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో సీబీఐ విచారణ జరిగిన విషయాన్ని గుర్తుచేశారు. చంద్రబాబు నాయుడు తన కుమారుడు నారా లోకేష్‌ను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మీడియా సంస్థలు, సోషల్ మీడియా వేదికలను బ్లాక్ చేయడం అన్యాయమని, ప్రభుత్వం అధికారాన్ని దుర్వినియోగం చేస్తోందని దేవభక్తుని చక్రవర్తి విమర్శించారు.

# అక్రమ కేసులతో ప్రజాస్వామ్యాన్ని అణచలేరు




**పెన్ పవర్ కృష్ణాజిల్లా, పెనమలూరు సెప్టెంబర్ 09**
అక్రమ కేసులతో ప్రజాస్వామ్యాన్ని అణచలేరు
చంద్రబాబు అరెస్టు ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజు
ఎమ్మెల్యే బోడె ప్రసాద్
అక్రమ కేసులతో ప్రజాస్వామ్యాన్ని అణచివేయలేరని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. చంద్రబాబు నాయుడి అరెస్టు ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజని పేర్కొన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చంద్రబాబు నాయుడి అరెస్టుకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం "చీకటి రోజు" కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ అధ్యక్షుడు వీరంకి గురుమూర్తి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో పాటు నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు 53 కొవ్వొత్తులు వెలిగించి "ప్రజాస్వామ్యంలో నిజం గెలిచింది" అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడిని అక్రమంగా అరెస్టు చేసిన రోజును ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసు పేరుతో తప్పుడు ఆరోపణలు చేసి చంద్రబాబును 53 రోజుల పాటు జైలులో నిర్బంధించారని ఆరోపించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం ద్వారా 21 లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణ, లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో బీసీ నాయకులు, టీడీపీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులతో వేధింపులకు పాల్పడ్డారని బోడె ప్రసాద్ ఆరోపించారు. టీడీపీని భూస్థాపితం చేయాలని ప్రయత్నించినా, తెలుగు జాతి ఉన్నంతకాలం ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీని ఎవరూ ఏమీ చేయలేరన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారు గళమెత్తారని, మహిళలు సైతం పెద్దఎత్తున ఉద్యమించారని పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు గత ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు.

ప్రజలే విపక్షాలకు బుద్ధి చెబుతారు
కృష్ణాజిల్లా టీడీపీ అధ్యక్షుడు వీరంకి గురుమూర్తి మాట్లాడుతూ.. ఐదు దశాబ్దాలుగా రాష్ట్ర అభివృద్ధి కోసం శ్రమిస్తున్న చంద్రబాబు నాయుడికి ప్రజల మద్దతు పుష్కలంగా ఉందన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న డీఎస్సీ తదితర సంక్షేమ కార్యక్రమాలపై విపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి తిరుగులేని విజయాన్ని అందించడం ద్వారా ప్రజలే విపక్షాలకు గట్టిగా బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు బజారులో ఫిర్యాదు బాక్సు ఏర్పాటు

## ఈవో బి.శ్రీనివాసరావు



చల్లపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 09
స్థానిక రైతు బజారులో ఎస్టేట్ ఆఫీసర్ బి.శ్రీనివాసరావు బుధవారం ఫిర్యాదుల బాక్సును ఏర్పాటుచేశారు. రైతులు, వినియోగదారుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేసేందుకు ఫిర్యాధుల బాక్సు ఏర్పాటుచేయట శుభపరిణామం అని వినియోగదారులు పేర్కొన్నారు. ప్రతి రైతు బజారులో విధిగా ఫిర్యాదుల బాక్సు ఏర్పాటుచేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ అవి ఎక్కడా కనిపించవని చల్లపల్లిలో ఏర్పాటుచేయటం శుభపరిణామమని అన్నారు. ఈసందర్భంగా ఎస్టేట్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతుబజారులో కూరగాయల విక్రయాలు, ధరలు, తూకాల్లో తేడాలు, పారిశుధ్యం, తాగునీరు, వసతులు, వ్యాపారులకు, వినియోగదారులకు ఎదురవుతున్న సమస్యపై ప్రజలు తమ ఫిర్యాదులను, సూచనలను ఈ బాక్సులో వేయవచ్చని తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని శ్రీనివాసరావు చెప్పారు. ఫిర్యాదు ఆధారంగా రైతు బజారులోని సేవలను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు.

# నిజం గెలిచింది.. నీతి నిలిచింది

## - 53 కొవ్వొత్తులతో చంద్రబాబుకు గూడూరు టీడీపీ నేతల సంఘీభావం





**గూడూరు, పెన్ పవర్,సెప్టెంబరు 9:**
తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి అక్రమ అరెస్టును నిరసిస్తూ గూడూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు 53 కొవ్వొత్తులు వెలిగించి సంఘీభావం తెలిపారు. రాజకీయ దురుద్దేశంతో తప్పుడు కేసులో చంద్రబాబును అరెస్టు చేసి 53 రోజులపాటు నిర్బంధించిన నాటి ఘటనను గుర్తుచేసుకుంటూ 'నిజం గెలిచింది.. నీతి నిలిచింది' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు గోపి నాగబాబు మాట్లాడుతూ.. మూడేళ్ల క్రితం ఇదే రోజున అర్ధరాత్రి చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి జైలులో నిర్బంధించారని అన్నారు. నాటి చీకటి రోజులను ప్రజలు ఎన్నటికీ మరిచిపోరన్నారు. ఐదు దశాబ్దాలుగా నిస్వార్థ రాజకీయ విలువలకు ప్రతీకగా నిలిచిన చంద్రబాబు ప్రజల ఆశీస్సులతో తప్పుడు కేసుల నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు. ప్రజాబలమే తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబుకు శ్రీరామరక్ష అని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పోతన రామోజీ, తోట వేణు, అన్నం హరి రామకృష్ణ, కూనపరెడ్డి పెద్దిరాజులు, ఎన్.ఏ. బేగ్, కాట్రగడ్డ రత్నబాబు, కటకం నాగమల్లేశ్వరరావు, బత్తిన వీరబాబు, యర ప్రసాద్, కట్‌రెడ్డి నాగమురళి, పూల నాగరాజు, పాలగాని మహేష్, బాసంశెట్టి విజయ్, బొర్రా నాగరాజు, శ్రీను, గౌరిపర్తి రాజబాబు, పోతన రంగా, అట్లూరి శ్రీను, రావి సత్యనారాయణ, బేతల స్వామి, శీలం పవన్ కళ్యాణ్, అలుగు సారథి, దోమతోటి సుధాకర్, డొక్కు బాబురావు, కొలుసు నరసింహారావుతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నోటీసులు అందుకున్న ఓటర్లు విచారణకు హాజరుకావాలి: మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరి బాబు



**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 09 :**
చిలకలూరిపేట : ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్ -2026) కార్యక్రమంలో భాగంగా 'నో మ్యాపింగ్' మరియు 'అనామలీస్' సమస్యలపై నోటీసులు అందుకున్న పట్టణ ఓటర్లు సెప్టెంబర్ 11వ తేదీ లోపు మున్సిపల్ కార్యాలయంలో జరిగే విచారణకు విధిగా హాజరుకావాలని సహాయ ఓటరు నమోదు అధికారి, మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరి బాబు ఒక ప్రకటనలో తెలిపారు. నోటీసులు అందుకున్న వారు తమ వెంట అవసరమైన ఆధారాలు, ధృవీకరణ పత్రాలను తీసుకువచ్చి తమ ఓటు హక్కును తుది జాబితాలో ఖాయపరచుకోవాలని సూచించారు. నోటీసులు పొంది కూడా విచారణకు హాజరుకాని వారి ఓట్లను తుది ఓటర్ల జాబితా నుండి శాశ్వతంగా తొలగిస్తామని ఆయన స్పష్టం చేశారు. దీనిపై ఏవైనా సందేహాలు లేదా ఇతర సమాచారం కోసం సంబంధిత బూత్ లెవల్ అధికారులను (బీఎల్ఓ) సంప్రదించాలని కమిషనర్ కోరారు.ద

# ఎడ్లపాడు పీహెచ్సీలో ఆశా కార్యకర్తలకు గర్భిణీ నమోదుపై అవగాహన.




**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, సెప్టెంబర్ 09 :**
ఎడ్లపాడు: నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎడ్లపాడు పీహెచ్సీలో గర్భిణీ స్త్రీల ముందస్తు నమోదు, సమగ్ర ఆరోగ్య సంరక్షణపై ఆశా కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు సువర్ణ కుమారి మాట్లాడుతూ ప్రారంభ దశలోనే తల్లి, శిశు ఆరోగ్య పరీక్షలు, రక్తహీనత, రక్తపోటు, మధుమేహం, స్కానింగ్, హెచ్ఐవి, బ్లడ్గ్రూపు పరీక్షలు, ఉచిత మందులు, ఫోలిక్ యాసిడ్, ఐరన్ మాత్రలుఅందుబాటులో ఉంటాయని నిపుణులు వివరించారు. అంగన్వాడీ ద్వారా పాలు, గుడ్లు, పోషకాహారం, ప్రభుత్వ పథకాల కింద ఆర్థిక సాయం అందజేస్తారు.
నమోదు అనంతరం సమగ్ర పరీక్షలు, కాన్పు జాగ్రత్తలు, నెలవారీ చెకప్లు, వైద్య సలహాలు, స్వీయ వైద్యం చేసుకోవద్దని ఆశాలకుసూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు, ఉపాధ్యక్షుడు వై.ప్రసాదరావు, పీహెచ్సీ వైద్యాధికారి, సీహెచ్ఓ,సూపర్వైజర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# రేషన్ షాపులో 3.15 క్వింటాళ్ల బియ్యం తక్కువ

## -అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు: ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఓంకార్

## - రేషన్ షాపు నిర్వాహకురాలిపై 6ఏ కేసు నమోదు

**చీరాల, సెప్టెంబర్ 9 (పెన్ పవర్):**
పట్టణంలోని రేషన్ షాపులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఓంకార్ ఆధ్వర్యంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ నంబర్ రేషన్ షాపును తనిఖీ చేయగా, రికార్డుల్లో ఉన్న నిల్వలతో పోలిస్తే 3.15 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో షాపు నిర్వాహకురాలు



మల్లెల సునీతపై 6ఏ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.
ఈ సందర్భంగా డీటీ ఓంకార్ మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందించాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, విక్రయించడం, తరలించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడే రేషన్ షాపులపై కేసులు నమోదు చేయడంతో పాటు అవసరమైతే లైసెన్సులు రద్దు చేసే అవకాశం ఉందన్నారు.
తెల్ల రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం అందిస్తున్న బియ్యం పక్కదారి పట్టకుండా నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా విక్రయించినా, తరలించినా, కొనుగోలు చేసినా బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.
తనిఖీల్లో సివిల్ సప్లయ్స్ రేషన్ ఇన్‌స్పెక్టర్లు అబ్రహం, కిషోర్, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



# కనకదుర్గమ్మ ఆలయానికి రూ.10 లక్షల నిధులు

పెడన, పెన్ పవర్,సెప్టెంబర్ 9
పెడన పట్టణం ఒకటో వార్డులోని పైడమ్మ తల్లి కాలనీ సమీపంలో నిర్మిస్తున్న పసుపుకుంకుమ సమేత శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం (కనకదుర్గమ్మ గుడి)కి టీటీడీ శ్రీవాణి ట్రస్టు నిధుల నుంచి తొలి విడతగా రూ.10 లక్షల చెక్కును ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ బుధవారం అందజేశారు. ఆలయ నిర్మాణానికి మొత్తం రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే అందిస్తున్న సహకారం అభినందనీయమని ధర్మకర్త అమ్మనమంచి శ్రీనివాస్ శర్మ పంతులు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు శ్రీనివాస్ వీణం, కొలుకుల శ్యామసుందరరావు, బొర్రా సాంబయ్య, లలితకుమారి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నిజం గెలిచింది కార్యక్రమం ఘనంగా నిర్వహణ

## మండల టీడీపీ అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్

చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 09 :
చిలకలూరిపేట : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు చిలకలూరిపేట మండల టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్ ఆధ్వర్యంలో "నిజం గెలిచింది" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి రాజకీయంగా దెబ్బతీయాలని చూసిన వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి తన ఓటమికి తానే బాటలు వేసుకున్నారని, న్యాయం, ప్రజా విశ్వాసం ముందు కుట్రలు ఎన్నటికీ



నిలబడవని స్పష్టం చేశారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని, పార్టీ బలోపేతానికి కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్, యూనిట్ ఇంచార్జీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట చర్యలు
- 15న శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్న సీఎం
- భక్తులు, ఉద్యోగుల సంక్షేమానికి టీటీడీ పెద్దపీట
- తిరుమలకు వచ్చే భక్తులకు తొలిసారిగా లైఫ్ ఇన్సూరెన్స్
- భాషా, సాంస్కృతిక అభివృద్ధికి టీటీడీ సహకారం : టీటీడీ చైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు

**తిరుమల, సెప్టెంబర్ 9 పెన్ పవర్,**
తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తోందని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో బుధవారం ఛైర్మన్ అధ్యక్షతన టీటీడీ పాలక మండలి సమావేశం జరిగింది. అనంతరం సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలను టీటీడీ ఈవో శ్రీ ముద్దాడ రవిచంద్రతో కలిసి ఛైర్మన్ మీడియాకు వెల్లడించారు.
ముఖ్యాంశాలు
తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నాం. అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.
ఈ నెల 14వ తేదీ సాయంత్రం 7 గంటలకు అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి.
సెప్టెంబర్ 15న సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణం నిర్వహిస్తాం.
సెప్టెంబర్ 15న రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ముఖ్యమంత్రిగారి పర్యటన నేపథ్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాం.
అదే రోజు రాత్రి 9 గంటలకు శ్రీ స్వామివారి పెద్దశేష వాహన సేవలో ముఖ్యమంత్రి పాల్గొంటారు.
రిలయన్స్ సంస్థ టీటీడీకి విరాళంగా అందించిన 25 ఎలక్ట్రిక్ బస్సులను
సెప్టెంబర్ 16న ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు.
అదే కార్యక్రమంలో 2027 సంవత్సరానికి సంబంధించిన టీటీడీ క్యాలెండర్లు, డైరీలను ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారు.
భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిరోజూ 10 లక్షల లడ్డూలను అందుబాటులో ఉంచుతున్నాం.
బ్రహ్మోత్సవాల్లో దేశవ్యాప్తంగా 25 రాష్ట్రాలతో పాటు సింగపూర్, జర్మనీ దేశాల నుంచి కళాకారులు పాల్గొననున్నారు.
భక్తుల భద్రతకు 3,000 మంది పోలీసులతో పాటు 2,500 మంది టీటీడీ నిఘా, భద్రతా సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నాం.
తిరుమలలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు 3,000 నుంచి 3,300 మంది సిబ్బందిని నియమిస్తున్నాం.
ఈ ఏడాది గరుడసేవకు గతేడాదితో పోలిస్తే 15 నుంచి 20 శాతం మంది భక్తులు అదనంగా వచ్చే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.
గరుడసేవ రోజున గతేడాది 6.13 లక్షల మందికి అన్నప్రసాదం అందించగా, ఈసారి 9.30 లక్షల మందికి అన్నప్రసాదం అందించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇది గతేడాదితో పోలిస్తే 52 శాతం అదనం.
లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగంతో సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.
దర్శనం, వసతి, అన్నప్రసాదం, రవాణా, భద్రత, వైద్యం, పారిశుద్ధ్యం, విద్యుత్, పుష్పాలంకరణలు తదితర అన్ని విభాగాల్లో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.
శ్రీవారి బ్రహ్మోత్సవాలకు దేశం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన దర్శనం, సురక్షితమైన వాతావరణం, మెరుగైన వసతులు కల్పించడమే టీటీడీ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోంది.
భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా టీటీడీ, పోలీస్, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పటిష్టమైన, సమగ్ర ఏర్పాట్లు చేపట్టింది.
శ్రీవారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విజయవంతంగా నిర్వహించేందుకు టీటీడీ సిద్ధంగా ఉంది.
ఇతర అంశాలు :
భక్తులు, ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, తిరుమలలో ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు అందించే బీమాను రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచేందుకు నిర్ణయం తీసుకున్నాం.
శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు తిరుమలలో సహజ మరణం సంభవించిన సందర్భంలో లైఫ్ ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించాం. ఈ విధానాన్ని దేశంలోనే తొలిసారిగా ఆలయాల పరిపాలనలో టీటీడీ ప్రవేశ పెట్టింది. ఈ పథకం ద్వారా మరణించిన భక్తుని కుటుంబానికి రూ.2 లక్షలు చెల్లిస్తారు.
పదవీ విరమణ పొందిన సిపిఎస్ /ఎన్ పి ఎస్ పెన్షనర్లు, వారి కుటుంబాలకు ఒపీఎస్ /పెన్షనర్లు తరహాలో ఈ హెచ్ ఎఫ్ సౌకర్యం కల్పిస్తూ నిర్ణయం
తిరుమలలోని అన్నప్రసాద కేంద్రం, క్యాంటీన్లు, హోటళ్ల నుంచి వచ్చే ఆహార వ్యర్థాలను విభాగాలుగా విభజించి వాటర్ హైడ్రాలసిస్ ప్రక్రియ ద్వారా బయోగ్యాస్ తయారు చేసి టీటీడీ అన్నప్రసాద కేంద్రానికి సరఫరా చేసేందుకు IOCL సంస్థ ముందుకు వచ్చింది. ఇందుకోసం బయోగ్యాస్ ప్లాంట్ నిర్వహణను రూ.2.80 కోట్లతో M/s GPS Renewables కు అప్పగించేందుకు ఆమోదం తెలిపాం.
శ్రీవారి పోటులో లడ్డూల తయారీని మరింత వేగవంతం చేసేందుకు 400 మంది అదనపు అవుట్‌సోర్సింగ్ వర్కర్ల పోస్టుల కోసం ప్రభుత్వ అనుమతికి ప్రతిపాదనలు పంపుతున్నాం.
టీటీడీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 48 మంది ఉద్యోగుల వేతనాలను పెంచేందుకు నిర్ణయం తీసుకున్నాం.
తిరుమలలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు అదనపు సిబ్బందికి తిరుమలకు రవాణా ఛార్జీలు చెల్లించేందుకు నిర్ణయించాం. ఇందుకోసం 3 సంవత్సరాలకు రూ.1.60 కోట్లు మంజూరు చేశాం.
నారాయణవనంలోని శ్రీ పద్మావతి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో అమ్మవారి పద్మపీఠానికి బంగారు తాపడం ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపాం.
చెన్నైలోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ ధ్వజస్తంభం, బలిపీఠానికి బంగారు తాపడం చేసేందుకు రూ.17.05 కోట్లకు ఆమోదం తెలిపాం.
తిరుపతిలో తెలుగు, సంస్కృత అకాడమీకి కేటాయించిన టీటీడీ భవనం లైసెన్సు గడువును మరో మూడేళ్లపాటు, అంటే 02-11-2026 నుంచి 01-11-2029 వరకు పొడిగించేందుకు ఆమోదం తెలిపాం.
ఈ సమావేశంలో టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, జేఈవోలు డా.ఎ.శరత్, ప్రభల గోపినాథ్, సివిఎస్వో కే వి మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జనసైనికుల్లో నెలకొన్న నైరాశ్యం

**కాకినాడ, సెప్టెంబర్ 9, పెన్ పవర్:** జనసేనలో స్తబ్దత నెలకొంది. ఇటు నేతల్లోనూ అటు కార్యకర్తల్లోనూ ఈ నైరాశ్యం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం పెద్దగా లేదు. అక్టోబరు చివరలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ నైరాశ్యం జనసేనను ఎటు వైపు తీసుకెళుతుందన్న చర్చ ఇటు పార్టీలోనూ, అటు కూటమిలోనూ జరుగుతోంది. పవన్ కల్యాణ్ అస్వస్థతకు గురయి కేరళలో ఆయుర్వేద చికిత్స తీసుకు వచ్చిన తర్వాత కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచారంలో పాల్గొంటారా? లేదా? అన్న దానిపై స్పష్టత లేదు. పవన్ ప్రచారానికి రాకుంటే పార్టీ తీవ్రంగా నష్టపోతుందన్న భావన జనసైనికుల్లోనూ, కూటమిలోని మిగిలిన పార్టీల్లోనూ వ్యక్తమవుతుంది. ఈ కారణం వల్లనే జనసైనికుల్లోనూ, నేతల్లోనూ కొంత స్తబ్దత నెలకొందని చెప్పాలి. జనసేన పార్టీలో ఎప్పుడైనా నైరాశ్యం లేదా స్తబ్దత నెలకొన్నప్పుడు, ఆ నైరాశ్యాన్ని పారదోలి పార్టీని ముందుకు నడిపేది ముమ్మాటికీ ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ మాత్రమే. రాజకీయాల్లో ఒడిదొడుకులు సహజం. 2019 ఎన్నికల ఓటమి తర్వాత లేదా కూటమి రాజకీయాల నేపథ్యంలో కార్యకర్తలలో అక్కడక్కడా గందరగోళం, నైరాశ్యం ఏర్పడిన ప్రతిసారీ పవన్ కల్యాణ్ తన స్ఫూర్తిదాయక ప్రసంగాలు, వ్యూహాత్మక నిర్ణయాలతో శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతూ వస్తున్నారు. పార్టీలో నైరాశ్యాన్ని పారదోలేందుకు, క్యాడర్‌ను ఉత్తేజపరిచేందుకు కేవలం పవన్ కల్యాణ్ మత్రమే కారణమవుతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయడం, సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టడం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సమన్వయ కమిటీలను నియమించి దిశానిర్దేశం చేయడం ద్వారా




శ్రేణులకు ఆయన భరోసా ఇస్తున్నారు.2024 ఎన్నికల్లో సాధించిన 100% విజయంతో ప్రస్తుతం జనసేన ఏపీ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉంది. డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రజా సమస్యలపై స్పందిస్తున్న తీరు కార్యకర్తల్లో గర్వాన్ని, ఉత్సాహాన్ని నింపుతున్నాయి. నాదెండ్ల మనోహర్, నాగబాబు మరియు ఇతర ముఖ్య నేతలు పార్టీ అంతర్గత వ్యవహారాలను చక్కదిద్దుతూ, స్థానిక నాయకులను సమన్వయం చేస్తూ నైరాశ్యానికి తావులేకుండా చూస్తున్నారు. జనసేన బలం వారి అంకితభావం గల జనసైనికులు, వీరమహిళలు. విపక్షాల విమర్శలను తిప్పికొడుతూ సోషల్ మీడియా వేదికగా పార్టీ సిద్ధాంతాలను వారు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. పార్టీ ఎదుగుదల క్రమంలో ఇప్పుడు పవన్ కల్యాణ్ ఈ నైరాశ్యాన్ని పారదోలాలంటే స్వయంగా పూనుకోవాలి. అలాగే ఆగస్టు 15వ తేదీ నాటికి నియమిస్తామన్న కమిటీల నియామకాన్ని వెంటనే చేపట్టాలి. నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించాలన్నఅభిప్రాయం వ్యక్తమవుతుంది.

# పార్టీల పేర్లతో ఐడీలు తీవ్రమైన ఈగో పోరు

**విజయవాడ, సెప్టెంబర్ 9, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వ విధానాలు, విజయాలు ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుపడుతున్న ప్రధాన శక్తి ప్రతిపక్షం కంటే కూడా ఇరు పార్టీల సానుభూతిపరులుగా సోషల్ మీడియాలో చెలామణి అవుతున్నవారే. అనడంలో ఎలాంటి సందేహం లేదు. క్షేత్రస్థాయిలో నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ పొత్తు ధర్మాన్ని పాటించి పాలనపై దృష్టి సారిస్తుంటే, సోషల్ మీడియాలో ఇరు పార్టీల పేర్లతో తిరిగే ఐడీలు తీవ్రమైన ఈగో పోరుతో కూటమి స్ఫూర్తికే ఘోరమైన విఘాతం కలిగిస్తున్నాయి. ముఖ్యంగా సినీ హీరోల అభిమానుల మధ్య ఉండే పాత కక్షలు, వ్యక్తిగత ఆధిపత్య పోరును రాజకీయాలకు రుద్ది, పరస్పరం పార్టీ అధినేతలను, వారి కుటుంబ సభ్యులను అసభ్యకరంగా దూషించుకునే స్థాయికి దిగజారిపోతున్నారు.సాధారణంగా ఏ రాజకీయ పార్టీకైనా సోషల్ మీడియా విభాగం లేదా సానుభూతిపరులు అనేది ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనా సంస్కరణలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే డిజిటల్ సైన్యంలా పనిచేయాలి. అయితే ఈ రెండు పార్టీల సోషల్ మీడియా అతివాదులు మాత్రం ప్రభుత్వం సాధిస్తున్న విజయాలు, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాలను పక్కనబెట్టి.. పరస్పరం చురకలు వేసుకోవడానికి, ఎన్టీఆర్ లేదా చిరంజీవి వంటి దిగ్గజాల పేర్లను లాగి బురద చల్లుకోవడానికే సమయాన్ని వెచ్చిస్తున్నారు. అసలైన ప్రాధాన్యతలను విడిచిపెట్టి వ్యక్తిగత ద్వేషాన్ని ప్రచారం చేసే వీరు ఎంతమాత్రం పార్టీ సానుభూతిపరులు అనిపించుకోరు, పైగా ప్రత్యర్థి పార్టీ వైఎస్ఆర్‌సీపీకి అయాచితంగా పొలిటికల్ అడ్వాంటేజ్‌ను ప్లేట్‌లో పెట్టి ఇస్తున్నారు.వైసీపీ అమలు చేస్తున్న ఫేక్ నెరేటివ్‌లు, ప్రభుత్వ విధానాలపై చేస్తున్న తప్పుడు ప్రచారాలను సంయుక్తంగా తిప్పికొట్టాల్సిన సమయంలో.. ఈ రెండు వర్గాలు ఒకరి శాఖల్లోని లోపాలను మరొకరు వెతికి నెట్‌లో రచ్చకెక్కడం కూటమి ప్రభుత్వ పరువు తీస్తోంది. ఇటు టీడీపీ శ్రేణులు, అటు జనసేన సైనికులు పరస్పరం డిపార్ట్‌మెంట్ వ్యాఖ్యలపై కౌంటర్లు ఇచ్చుకోవడం వల్ల ప్రజల్లోకి ప్రభుత్వంలో సమన్వయం లేదు అనే తీవ్ర ప్రతికూల సంకేతాలు వెళు‌్తన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్న ఈ కీలక సమయంలో, ప్రయివేటు అకౌంట్ల నుంచి జరిగే ఈ విపరీతమైన ఈగో వార్ రాజకీయంగా కూటమి పునాదులకే ఎసరు పెట్టే ప్రమాదం ఉంది. దీన్ని ఆసరా చేసుకుని వైసీపీ సోషల్ మీడియా టీడీపీ, జనసేన పేరుతో ఫేక్ అకౌంట్లను రంగంలోకి తెచ్చి మరింతగా వివాదాలను పెంచుతోది.ఈ పరిస్థితికి చెక్ పెట్టాలంటే కేవలం హెచ్చరికలు, హితవులతో సరిపెట్టుకుంటే లాభం లేదు. ఇరు పార్టీల నాయకత్వాలు సీరియస్‌గా స్పందించి, తమ అధికారిక సోషల్ మీడియా వింగ్‌ల ద్వారా క్రమశిక్షణను కఠినంగా అమలు చేయాల్సి ఉంది. హద్దులు దాటి పరస్పర అధినేతలను, కుటుంబ సభ్యులను అసభ్యకరంగా దూషిస్తున్న ఐడీలను గుర్తించి, వారు సొంత కేడర్ అయినా సరే సైబర్ పోలీసుల ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదా పార్టీల నుంచి బహిరంగంగా దూరం పెట్టడం చేయాలి. పార్టీ ఆత్మగౌరవం కంటే కూటమి బంధం, ప్రభుత్వ స్థిరత్వమే ముఖ్యమని ఇరు అధినేతలు కేడర్‌కు గట్టిగా స్పష్టం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఉమ్మడి రాజకీయ ప్రత్యర్థి వైఎస్ఆర్‌సీపీపై పోరాడటాన్ని మర్చిపోయి, తమలో తామే సోషల్ మీడియాలో కొట్టు చావడం అనేది కూటమి ఐక్యతకు కన్పించని శత్రువులా మారింది.

# న్యాయపోరాటంలో డీఎస్సీ అభ్యర్థులు




**విజయవాడ, సెప్టెంబర్ 9, పెన్ పవర్:** మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల కష్టాన్ని, పారదర్శకంగా జరిగిన నియామకాల ప్రక్రియను దెబ్బతీసేలా సాగుతున్న ఫేక్ ప్రచారాలపై ఇక కేవలం ప్రెస్ మీట్ల స్పష్టతలతో సరిపెట్టుకోవడం సాధ్యం కాదు. నిబంధనల ప్రకారం కష్టపడి మెరిట్ సాధించి ఉద్యోగాలు పొందిన టీచర్లు తమ కష్టాన్ని కించపరిచేలా సోషల్ మీడియా, కొన్ని మీడియా ఛానెళ్లలో జరుగుతున్న తప్పుడు దాడిపై నేరుగా న్యాయపోరాటానికి సిద్ధం కావాల్సిన సమయం వచ్చింది. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తూ తమ ఆత్మగౌరవాన్ని, భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న వారిపై ప్రతి ఉపాధ్యాయుడు వ్యక్తిగతంగా సివిల్, క్రిమినల్ పరువునష్టం కేసులు వేయడం ద్వారానే ఈ వికృత క్రీడకు అడ్డుకట్ట పడుతుంది.ఆరోపణలకు గురవుతున్న బాధిత ఉపాధ్యాయులందరూ ఐక్యంగా ఒక వేదికపైకి వచ్చి, రూ. కోట్ల పరిపరిహారాన్ని డిమాండ్ చేస్తూ క్రిమినల్ దావాలు దాఖలు చేయాలి. ఫేక్ స్కామ్ అంటూ కోర్టు పరిధిలో తేలని విషయాలను జడ్జిమెంట్లుగా ప్రచారం చేస్తున్న మీడియా సంస్థలు, యూట్యూబర్లు, రాజకీయ నాయకులకు లీగల్ నోటీసులు పంపాలి. స్వయంగా కష్టపడి సాధించుకున్న ఉద్యోగాన్ని సవాలు చేస్తూ విచారణ పేరుతో మానసిక క్షోభకు గురిచేస్తున్న ప్రతి ఒక్కరినీ కోర్టు బోనులో నిలబెట్టినప్పుడే, బాధ్యతారాహిత్యంగా మాట్లాడే వారికి చట్టం పవర్ ఏంటో అర్థమవుతుంది.మరోవైపు ఏపీ ప్రభుత్వం కూడా ఇక ఎంతమాత్రం ఉపేక్షించే ధోరణిలో ఉండకూడదు. అధికారులు ప్రతిసారీ స్క్రీన్లపై ఆధారాలు చూపుతూ కేస్-టు-కేస్ ఓపికగా సమాధానాలు ఇచ్చినంత కాలం ఇచ్చారు. కానీ, ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ వ్యవస్థల పరువు తీయడమే లక్ష్యంగా కుట్రపూరిత ప్రచారాలు చేస్తున్న వారిపై ప్రభుత్వమే స్వయంగా కేసులు నమోదు చేయాలి. ఫేక్ న్యూస్, డీఎస్సీ నియామకాల ప్రాసెస్‌పై ఎప్పటికప్పుడు వస్తున్న ఆరోపణలు, సామాజిక మాధ్యమాల్లో జరిగే ప్రచారాలు కేవలం ఒక వ్యవస్థను మాత్రమే కాకుండా, రాత్రింబవళ్లు కష్టపడి ఉద్యోగాలు సాధించిన వేలాదిమంది ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కూడా దెబ్బతీస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చే వివరణలు లేదా పత్రికా ప్రకటనలు కేవలం తాత్కాలిక సడలింపునిస్తాయే తప్ప, ఇలాంటి దుష్ప్రచారాలకు శాశ్వత ముగింపు పలకలేవు. చట్టం ఇచ్చిన రక్షణలను సద్వినియోగం చేసుకుంటూ, ఆధారాలు లేని తప్పుడు ప్రచారాలపై కఠినమైన చట్టపరమైన చర్యలకు పూనుకోవాల్సిన అవసరం ఇప్పుడు ఎంతైనా ఉంది.భారతీయ శిక్షాస్మృతి పరిధిలోని క్రిమినల్ నిబంధనల ప్రకారం కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించినందుకు క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చు. అంతేకాకుండా, సివిల్ కోర్టులలో కోట్ల రూపాయల పరువు నష్టం దావాలు వేయడం ద్వారా తప్పుడు ప్రచారం చేసేవారికి ఆర్థికపరమైన భయాన్ని కలిగించవచ్చు. సోషల్ మీడియా ద్వారా ఈ ప్రచారాలు జరుగుతున్నందున, సమాచార సాంకేతిక పరిజ్ఞాన చట్టం కింద కూడా ఫిర్యాదులు చేసి, ఆయా ఖాతాలను బ్లాక్ చేయించడంతో పాటు బాధ్యులపై సైబర్ కేసులు నమోదు చేయవచ్చు. ప్రభుత్వం , విద్యాశాఖ కేవలం ప్రేక్షక పాత్ర వహించకుండా, డిఫెన్సివ్‌గా సమాధానాలు ఇవ్వడంతో సరిపెట్టకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రభుత్వ యంత్రాంగం నిర్వహించే అధికారిక పరీక్షల పై అసత్యాలు వ్యాప్తి చేయడం ప్రభుత్వ ప్రతిష్టను కూడా దెబ్బతీస్తుంది. కాబట్టి, సదరు ఉద్దేశపూర్వక దాడి వెనుక ఉన్న మూలాలను గుర్తించి, పోలీసు శాఖ ద్వారా సుమోటోగా కేసులు నమోదు చేయడం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ద్వారా డైరెక్ట్ క్రిమినల్ కంప్లైంట్ నమోదు చేయించడం ప్రభుత్వం వైపు నుంచి జరగాల్సి ఉంది. వివరణల కాలం ముగిసింది.. చట్టపరమైన చర్యల కాలం మొదలైంది అనే సంకేతం సమాజంలోకి వెళ్లాలి.

**చక్రపాణి రెడ్డి బూమ్ రాంగ్ అవుతుందా**

డీఎస్సీలో ఉద్యోగం సంపాదించి కుప్పంలో ఓ స్కూల్లో పని చేస్తున్నారు చక్రపాణి రెడ్డి. ఆయన మాజీ సైనికుడు, సెయిలింగ్ క్రీడాకారుడు కూడా. దేశ సేవ నుంచి రిటైరైన తర్వాత బీఈడీ పూర్తి చేసి ఉద్యోగం సంపాదించుకున్నారు. ఆయనతో రిపోర్టర్ అనుచితంగా ప్రవర్తించాడు. ఉపాధ్యాయ దినోత్సవం రోజే స్కూల్ కు వెళ్లి పిల్లల ముందే చొక్కా పట్టుకుని సర్టిఫికెట్లు చూపించాలని దౌర్జన్యం చేశాడు. ఇవన్నీ ఫోన్ లో రికార్డు అయ్యాయి. దాంతో పోలీసు కేసు నమోదు అయింది.ఇంత వరకూ బాగానే ఉన్నా.. చక్రపాణి రెడ్డిపై సాక్షి పేరుతో దౌర్జన్యం చేయడం మాత్రం ఓ వర్గంలో కలకలం రేపుతోంది. స్పోర్ట్స్ కోటా పేరుతో బీసీలపై దాడి చేస్తూ వచ్చారు ఇప్పటి వరకూ. అయితే రెడ్డి వర్గాన్ని కూడా వదలడం లేదని కుప్పం టీచర్ ఉదంతంతో క్లారిటీ వచ్చింది. ఓసీల్లో ఉండి ఉద్యోగం తెచ్చుకోవడం ఎంత ఆ వర్గంలో ఉండే వారికి తెలుసు. మాజీ సైనికుడు అయిన చక్రపాణి రెడ్డికి ఉద్యోగం వస్తే ఆయనను అవమానించడమే కాదు.. సాక్షిలోనూ తప్పుడు ప్రచారం చేశారు. ఈ అంశం రెడ్డి వర్గంలోనూ చర్చకు వస్తోంది.మాగుంట శ్రీనివాసులరెడ్డి ఇటీవల వెలిగొండ వేదికపై జగన్ ను మూర్ఖుడని తిట్టారు. ఇలాంటివి చేయాలని జగన్ రెడ్డి చెప్పరు కానీ ఆయన నైజానికి తగ్గట్లే జరుగుతాయి. ఆయన కు అవి ఇష్టం కాబట్టి సజ్జల చేయిస్తారు. దాని వల్ల ఎంత నష్టం జరుగుతుందో చెప్పడం కష్టం. మాగుంట మాట్లాడిన మాటల కన్నా.. కుప్పం టీచర్ చక్రపాణి రెడ్డి ఆవేదన .. వైసీపీకి ఊహించని నష్టం చేయబోతోంది.

# కొత్త పొలిటికల్ పార్టీకి స్పేస్ ఉందా

**విజయవాడ, సెప్టెంబర్ 9, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఏళ్ల తరబడి కీలక సూత్రధారిగా, వైసీపీకి ఆయువుపట్టులా వ్యవహరించిన విజయసాయిరెడ్డి ఇప్పుడు సొంతంగా పార్టీ పెట్టేందుకు రెడీ అయ్యారు. తాను సీఎంని అవుతా అంటే ఇంకా తేడాగా ఉంటుందని .. జెన్ జీని సీఎంను చేస్తానని వింత మాటలు చెబుతూ ప్రెస్మీట్ పెట్టారు. ఆయన తీరు చూసిన వారికి ఎవరికైనా రాజకీయ ఉత్సాహం గానీ, దూకుడు గానీ కనిపించడం లేదని అనిపిస్తుంది తీవ్రమైన అలసట, ముఖంలో నీరసం స్పష్టంగా కనిపిస్తోంది. ఏదో ఒత్తిడితో ఆయన రాజకీయ ప్రకటన చేస్తున్నట్లుగా కనిపిస్తోంది.విజయసాయిరెడ్డికి ఉన్న ఏకైక బలం ఆర్థిక వనరులు. రాజకీయాల్లో డబ్బు ఉంటే సరిపోదు, దానిని నమ్మివచ్చే నాయకులు, కేడర్ ఉండాలి అనేది ప్రాథమిక సూత్రం. విజయసాయిరెడ్డి వద్ద వనరులకు లోటు లేకపోయినా, కేవలం ఆయన పెట్టే ఖర్చులను చూసి , డిజిటల్ మీడియా ఫండింగ్‌ను ఆశించి వచ్చే అనుచరులు మాత్రమే ఆయన చుట్టూ చేరే అవకాశం ఉంది. ప్రజాదరణ, మాస్ ఇమేజ్ ఉన్న రాజకీయ నేతలెవరూ తమ భవిష్యత్తును ఆయన కొత్త పార్టీకి తాకట్టు పెట్టే సాహసం చేయరు. నియోజకవర్గాల్లో పట్టున్న నాయకులు కాకుండా, కేవలం నిధులు గుంజుకునే అవకాశం కోసమే వచ్చే ద్వితీయ శ్రేణి నేతలు, తాత్కాలిక అవకాశవాదులతో పార్టీ నడపడం ద్వారా ఆయనకు రాజకీయంగా ఒరిగేదేమీ ఉండదు. చివరికి మిగిలేది కేవలం ఖర్చు మాత్రమే.ఈ కొత్త ప్రయోగం వెనుక ఆయన అసలు కారణం ఏమిటన్న ప్రశ్న వస్తోంది. వైసీపీని వీడిన నాటి నుంచి జగన్ వైఖరిపై తీవ్ర అసంతృప్తి ఉన్నప్పటికీ, జగన్ పక్కన తనకు దక్కాల్సిన ప్రాధాన్యత , స్థానం మళ్లీ లభిస్తుందనే ఆశ ఆయనలో లోలోపల ఉందనే సంకేతాలు పదే పదే కనిపిస్తున్నాయి. నేరుగా వైఎస్సార్‌సీపీలోకి వెళ్లలేని పరిస్థితి ఉండటంతో, బయట ఒక మూడో ప్రత్యామ్నాయంగా లేదా ఒక రాజకీయ శక్తిగా తన ఉనికిని చాటుకోవడం ద్వారా.. జగన్ తన ప్రాధాన్యతను గుర్తించేలా చేయాలనే ఒక బార్గెనింగ్ స్ట్రాటజీ కూడా ఇందులో దాగి ఉండవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.మరోవైపు, పాత కేసుల నుంచి రక్షణ, రాజకీయ రంగంలో కొనసాగుతున్నామనే ఒక కవచాన్ని కాపాడుకోవడం లేదా ఇతర కేంద్ర పార్టీల ఒత్తిళ్లకు తలొగ్గడమూ ఈ కొత్త పార్టీ వెనుక కారణాలు కావచ్చు. అయితే, సొంతంగా ప్రజాకర్షణ లేని వ్యూహకర్తలు పార్టీలు పెట్టి జనం ముందుకు వెళ్లినప్పుడు ఎదురయ్యే ఆర్థిక, రాజకీయ పరాభవాలు చరిత్రలో చాలానే ఉన్నాయి. సాయిరెడ్డి వంటి సీనియర్ ఆడిటర్, వ్యూహకర్తకు ఈ విషయం తెలియంది కాదు. అయినప్పటికీ, ఆశయం కంటే ఒత్తిళ్లు, వ్యూహాల కంటే ఖర్చులే ఎక్కువగా ఉన్న ఈ కొత్త రాజకీయ ప్రయాణంలో విజయసాయిరెడ్డికి లభించే రాజకీయ మైలేజ్ అతిస్వల్పమే. పార్టీ నిర్మాణం, డిజిటల్ మీడియా నిర్వహణ పేరిట కోట్లాది రూపాయల ఖర్చు మినహా.. క్షేత్రస్థాయిలో ఓటు బ్యాంకు ఏమీ ఏర్పడదు.

# నాలుగు నెలల్లోనే రాబడి లోటు ఏకంగా 36,942 కోట్ల

**విజయవాడ, సెప్టెంబర్ 9, పెన్ పవర్:**
కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక స్థితి క్లిష్టంగాఉంది. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లోనే రాబడి లోటు ఏకంగా 36,942 కోట్లకు చేరుకుంది. ఇది యేడాది మొత్తానికి బడ్జెట్‌లో అంచనా వేసిన 22,003 కోట్ల కంటే ఎక్కువ. అదే సమయంలో ద్రవ్య లోటు 49,134 కోట్లకు చేరింది. ఇది వార్షిక అంచనాలో 64 శాతం. నికర రుణాలు కూడా సరిగ్గా అంతే మొత్తంలో ఉండటం రాష్ట్ర రుణ భారాన్ని స్పష్టం చేస్తోంది.ఈ గణాంకాలను ఆర్థిక వ్యవస్థ కోణంలో చూస్తే రాబడి లోటు 168% పెరగడం అంటే రాష్ట్రానికి వచ్చే రోజూవారీ ఆదాయం కన్నా నిత్యం చేసే ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయని అర్థం. పన్నులు, పన్నేతర మార్గాల ద్వారా వచ్చే స్వీయ ఆదాయం సరిపోకపోవడంతో ప్రభుత్వ నిర్వహణకే పెద్ద ఎత్తున నిధులు కొరవడుతున్నాయి. ఇతర ప్రధాన రాష్ట్రాలతో పోలిస్తే, ఆంధ్రప్రదేశ్ అత్యధిక రుణాలు , అత్యధిక రాబడి లోటుతో మొదటి వరుసలో నిలుస్తోంది.ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి ఇంత క్లిష్టంగా మారడానికి ప్రధాన కారణం జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులు , సంక్షేమ పథకాల ఉచితాల వ్యయం విపరీతంగా పెరిగిపోవడమే. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో సింహభాగం ఈ రోజువారీ నిబద్ధతలకే సరిపోతోంది. మరోవైపు, ఆదాయ మార్గాలను పెంచుకోవడంలోనూ, సంపద సృష్టించే మూలధన వ్యయం సాధించడంలోనూ ఆశించినంత వేగం కనిపించడం లేదు. బడ్జెట్ అంచనాలకు, వాస్తవ రాబడులకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసమే ఈ పరిణామానికి దారితీసింది.ఈ తరహా లోటు నిరంతరం పెరిగిపోతే రాష్ట్ర భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది. సంక్షేమ పథకాలు లేదా రోజువారీ నిర్వహణ ఖర్చుల కోసం తెచ్చిన అప్పుల వల్ల మూలధన సృష్టి నిలిచిపోయి అభివృద్ధి కుంటుపడుతుంది. తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించడానికే మళ్లీ కొత్త అప్పులు చేయాల్సి రావడం వల్ల రాష్ట్రం రుణ సంక్షోభం దిశగా వెళ్లే ప్రమాదం ఉంది. పైగా, క్రెడిట్ రేటింగ్‌లు తగ్గిపోయి భవిష్యత్తులో కొత్త అప్పులు పుట్టడం కూడా కష్టమవుతుంది. ఈ సంక్షోభం నుండి గట్టెక్కాలంటే ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తోంది. కేవలం అప్పులపై ఆధారపడటం తగ్గించి, కొత్త పరిశ్రమలు, పెట్టుబడుల ద్వారా పన్ను ఆదాయాన్ని పెంచుకునే ప్రణాళికలు రూపకల్పన చేయాలి. ఉత్పాదకేతర ఖర్చులను అదుపు చేస్తూ, సంపదను సృష్టించే మూలధన రంగానికి ప్రాధాన్యం ఇస్తోంది.ఈ ఫలితాలు వచ్చే సరికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది.

# రెబల్స్ డేంజర్ బెల్స్

**తిరుపతి, సెప్టెంబర్ 9, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి క్రమంగా పెరుగుతోంది. ఈ ఎన్నికలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యంత కీలకంగా చూస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన పరాజయం తర్వాత గ్రామీణ, పట్టణ స్థాయిలో తమ పార్టీకి ఎంతమేర బలం ఉందో నిరూపించుకునేందుకు ఈ ఎన్నికలను ఒక అవకాశంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతంతో పోలిస్తే కేడర్‌లో ఉత్సాహం పెరిగిందని, ప్రజల్లో కూడా తమకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని వైసీపీ నాయకత్వం అంచనా వేస్తున్నట్లు సమాచారం.పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో ఇప్పటికే ఎన్నికల సన్నద్ధతపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా స్థానిక ఎన్నికల్లో ఎక్కడా పోటీ లేకుండా ఏకగ్రీవంగా స్థానాలు వదిలేయకూడదనే సంకేతాలను పార్టీ శ్రేణులకు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రతి ప్రాంతంలో అభ్యర్థులను సిద్ధం చేసి, క్షేత్రస్థాయిలో పార్టీ ఉనికిని బలంగా చూపించాలని సూచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని వైసీపీ భావిస్తోంది.మరోవైపు అధికార కూటమిలోని తెలుగుదేశం పార్టీ , జనసేన పార్టీ , భారతీయ జనతా పార్టీ మధ్య స్థానిక సంస్థల సీట్ల పంపకం అంత సులభంగా ఉండకపోవచ్చని వైసీపీ అంచనా వేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా స్థానిక స్థాయిలో కూడా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఒకే నిర్ణయంతో పనిచేస్తారా అనే సందేహాలు ఉన్నాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. స్థానిక రాజకీయాల్లో వ్యక్తిగత బలం, వర్గ సమీకరణాలు ఎక్కువగా ప్రభావం చూపుతాయి. దీంతో టికెట్ దక్కని ఆశావహులు స్వతంత్రంగా లేదా రెబల్ అభ్యర్థులుగా బరిలోకి దిగే అవకాశముందని వైసీపీ లెక్కలు వేస్తోంది.అయితే ఈ అంచనాలన్నింటికంటే ముఖ్యంగా జగన్ ప్రచారం కీలకమవుతుందని పార్టీ నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులు, మేయర్ స్థానాలు, జెడ్పీ పీఠాలు వంటి పదవులు స్థానిక రాజకీయాల్లో గణనీయమైన ప్రభావం చూపుతాయి. జిల్లా కేంద్రాలు, ప్రధాన నగరాల్లో వచ్చే ఫలితాలు భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే జగన్ కనీసం కీలక జిల్లాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో సభలు నిర్వహిస్తే పార్టీకి ఊపు వస్తుందని నాయకులు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో జగన్ ప్రచారానికి దూరంగా ఉన్నారు. అయితే అప్పటికి వైసీపీ అధికారంలో ఉండటం, ప్రభుత్వ యంత్రాంగం మరియు రాజకీయ పరిస్థితులు తమకు అనుకూలంగా ఉండటం వంటి అంశాలు పార్టీకి కలిసివచ్చాయి. ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉండటంతో నాయకత్వం మరింత చురుగ్గా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.కూటమి ప్రభుత్వంపై జగన్ చేసే విమర్శలు, స్థానిక సమస్యలపై ఆయన ప్రసంగాలు ప్రజల్లోకి తీసుకెళ్లగలిగితే పార్టీకి అదనపు ప్రయోజనం కలుగుతుందని వైసీపీ నేతలు ఆశిస్తున్నారు. అయితే ఆయన రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేస్తారా, లేక ఎంపిక చేసిన ప్రాంతాలకే పరిమితమవుతారా అనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. స్థానిక ఎన్నికల షెడ్యూల్, రాజకీయ పరిస్థితులను బట్టి జగన్ ప్రచారంపై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

## ఒక్క పరుగుతో శతకం మిస్ చేసుకున్న తిలక్.. హాఫ్ సెంచరీ చేజార్చుకున్న తెలంగాణ డీజీపీ కొడుకు



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్ పోరులో సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మకు తీరని గుండెకోత మిగిలింది. ఈస్ట్ జోన్ నమోదు చేసిన 708 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఒంటరి పోరాటం చేసిన తిలక్, కేవలం ఒక్క పరుగు దూరంలో (99 రన్స్ వద్ద) శతకాన్ని చేజార్చుకున్నాడు. రోజంతా ఈస్ట్ జోన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించి, వీరోచితంగా పోరాడిన తిలక్.. నర్వస్ నైంటీస్‌లో సెంచరీకి ఒక్క అడుగు దూరంలో ఔట్ కావడంతో మైదానంలోనే తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. తిలక్ వర్మ సెంచరీ మిస్ కావడంతో సౌత్ జోన్ డ్రెస్సింగ్ రూమ్‌తో పాటు అభిమానులు తీవ్ర నిరాశలో మునిగిపోయారు. మరోవైపు ఈ మ్యాచ్‌లో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ కుమారుడైన చామ మిలింద్ కూడా దురదృష్టవశాత్తూ తన హాఫ్ సెంచరీని చేజార్చుకున్నాడు. సౌత్ జోన్ వికెట్లు వరుసగా పడుతున్న టైంలోనే క్రీజులోకి వచ్చిన మిలింద్, కెప్టెన్ తిలక్ వర్మతో కలిసి 78 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. 68 బంతుల్లో 7 ఫోర్లతో 43 రన్స్ చేసి ఊపుమీదున్న మిలింద్, స్పిన్నర్ శిఖర్ మోహన్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. బౌలింగ్‌లో 2 వికెట్లు తీసి, బ్యాటింగ్‌లోనూ 43 రన్స్ చేసిన మిలింద్ పోరాటం అభినందనీయమైనప్పటికీ, కేవలం 7 పరుగుల తేడాతో అర్ధ శతకం మిస్ అవ్వడం అతనికి తీవ్ర నిరాశ మిగిల్చింది.

**ఫాలో-ఆన్ గండంలో సౌత్ జోన్.. ఈస్ట్ జోన్ పేసర్ల దాడి:**

ఈ ఇద్దరు కీలక ప్లేయర్స్ ఔట్ కావడంతో సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్ ఆశలు పూర్తిగా ఆవిరయ్యాయి. ఈస్ట్ జోన్ నిర్దేశించిన 509 పరుగుల ఫాలో-ఆన్ మార్కును చేరుకోవడంలో సౌత్ జోన్ దారుణంగా ఫెయిల్ అయింది. ఈస్ట్ జోన్ స్టార్ వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ కొట్టిన డబుల్ సెంచరీకి తోడు మహమ్మద్ షమీ, ముకేష్ కుమార్ ప్రాణాంతకమైన స్పెల్స్‌తో విరుచుకుపడటంతో సౌత్ జోన్ లోయర్ ఆర్డర్ క్యూ కట్టింది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లోనే ఈస్ట్ జోన్ ఊహించని స్థాయిలో భారీ ఆధిక్యాన్ని సాధించి మ్యాచ్‌పై పూర్తి ఆధిపత్యం చెలాయించింది.

**వైభవ్ ఆల్-టైమ్ రికార్డ్.. దులీప్ ట్రోఫీ విన్నర్‌గా ఈస్ట్ జోన్:**

తిలక్ వర్మ సెంచరీ చేజారడం, చామ మిలింద్ పోరాటం ముగియడంతో ఈస్ట్ జోన్ దులీప్ ట్రోఫీ 2026 ఛాంపియన్‌గా నిలవడం ఇప్పుడు కేవలం లాంఛనంగా

మారింది. ఈ చారిత్రాత్మక విజయంతో 15 ఏళ్ల యంగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ దులీప్ ట్రోఫీ టైటిల్ గెలిచిన అత్యంత పిన్న వయస్కుడైన (యంగెస్ట్) ఆటగాడిగా ఆల్-టైమ్ రికార్డు సృష్టించబోతున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లోనే 708 పరుగుల భారీ స్కోరుతో సౌత్ జోన్ వెన్నువిరిచిన ఈస్ట్ జోన్, దులీప్ ట్రోఫీ విజేతగా నిలిచి సరికొత్త చరిత్ర రాయడానికి రెడీ అయింది.

## ఐదు నెలల తర్వాత హార్దిక్ రీఎంట్రీ.. సాయి సుదర్శన్‌కు చోటు: ఇండియాఏ స్క్వాడ్ ఇదిగో!




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా సుమారు ఐదు నెలల విరామం తర్వాత మళ్లీ పోటీ క్రికెట్‌లోకి అడుగు పెట్టబోతున్నాడు. వచ్చే నెల పుదుచ్చేరి వేదికగా ఆస్ట్రేలియా ఏ జట్టుతో జరగనున్న వైట్ బాల్ సిరీస్ కోసం బీసీసీఐ ఎంపిక చేసిన ఇండియా ఏ టీమ్ లో పాండ్యాకు చోటు లభించింది. అక్టోబర్ 6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ 3 వన్డేల సిరీస్‌లో హార్దిక్ పాల్గొనడం అతడి ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుంది. ఇండియా ఏ జట్టులో ఎంపికవ్వడంతో వెస్టిండీస్‌తో జరగబోయే వన్డే సిరీస్‌కు పాండ్యా దూరం కానున్నాడు.

**కెప్టెన్లుగా రుతురాజ్ గైక్వాడ్, దేవదత్ పడిక్కల్:**

ఆస్ట్రేలియా ఏ జట్టుతో జరిగే ఈ ప్రతిష్టాత్మక సిరీస్ కోసం బీసీసీఐ ఇద్దరు యంగ్ స్టార్లకు సారథ్య బాధ్యతలు అప్పగించింది. సెప్టెంబర్ 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యే రెండు మల్టీ-డే (4 రోజుల) మ్యాచ్‌ల సిరీస్‌కు కర్ణాటక స్టార్ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇటీవల శ్రీలంక టెస్టు పర్యటనలో నంబర్-3 స్థానంలో వరుసగా రెండు సెంచరీలు కొట్టిన పడిక్కల్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. ఇక అక్టోబర్ 6 నుంచి జరిగే 50 ఓవర్ల వన్డే సిరీస్‌కు రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్‌గా ఎంపిక కాగా, పడిక్కల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు.

**ఫిట్‌నెస్ టెస్ట్ పాసైతేనే గ్రౌండ్‌లోకి.. వెస్టిండీస్ సిరీస్‌కు పాండ్యా దూరం:**

హార్దిక్ పాండ్యా రాక కోసం అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నప్పటికీ, వైట్ బాల్ సిరీస్ లో అతను ఆడటం అనేది ఎన్‌సీఏ (చీజూా) ఇచ్చే ఫిట్‌నెస్ సర్టిఫికేట్‌పైనే మాత్రమే ఆధారపడి ఉంది. ఒకవేళ పాండ్యా పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తే మ్యాచ్ ప్రాక్టీస్ కోసం ఇండియా ఏ తరపున ఆస్ట్రేలియా ఏపై విరుచుకుపడేందుకు సిద్ధమవుతాడు. ఆసియా గేమ్స్ క్యాంపెయిన్, విండీస్ సిరీస్ ల నేపథ్యంలో సీనియర్ ప్లేయర్స్ అందుబాటులో లేకపోవడంతో యంగ్ ప్లేయర్లను, ఐపీఎల్ 2026లో మెరిసిన స్టార్లను ఎంపిక చేసినట్లు బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ల కమిటీ స్పష్టం చేసింది.

**ఇండియా 'ఏ' పూర్తి స్క్వాడ్స్:**

మల్టీ-డే జట్టు (4 రోజుల మ్యాచ్‌లు): దేవదత్ పడిక్కల్ (కెప్టెన్), సాయి సుదర్శన్ (వైస్ కెప్టెన్), అమన్ మోఖడే, ఆయుష్ పాండే, యశ్ రాథోడ్, షేక్ రషీద్, కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), షామ్స్ ములానీ, తనుష్ కొటియాన్, తుషార్ దేశ్‌పాండే, అంశుల్ కంబోజ్, ప్రాఫుల్ హింగే, ఎన్ జగదీసన్ (వికెట్ కీపర్), నాచికేత్ భుతే, వి వైశాఖ్.

వన్డే జట్టు (50 ఓవర్ల సిరీస్): రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), దేవదత్ పడిక్కల్ (వైస్ కెప్టెన్), ప్రియాన్ష్ ఆర్య, సాయి సుదర్శన్, రజత్ పటీదార్, కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), నిశాంత్ సింధు, విప్రాజ్ నిగమ్, అర్షిన్ కులకర్ణి, అర్షద్ ఖాన్, నమన్ ధీర్, హార్దిక్ పాండ్యా (ఫిట్‌నెస్‌కు లోబడి), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్ కీపర్), గుర్జాప్‌నీత్ సింగ్, యశ్ ఠాకూర్.

## దులీప్ ట్రోఫీ: ఇషాన్ కిషన్ మరోసారి విధ్వంసం.. ఈస్ట్ జోన్‌కు 584 పరుగుల భారీ ఆధిక్యం

**హైదరాబాద్ పెన్ పవర్:** దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో సౌత్ జోన్‌పై ఈస్ట్ జోన్ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించి తన పట్టును మరింత బిగించింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా బుధవారం జరిగిన నాలుగో రోజు ఆటలో, కెప్టెన్ ఇషాన్ కిషన్ (80), శిఖర్ మోహన్ (52) అద్భుతమైన హాఫ్ సెంచరీలతో రాణించారు. దీంతో ఆట ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ ఏకంగా 584 పరుగుల భారీ ఆధిక్యం సాధించి, టైటిల్‌ను దాదాపు ఖాయం చేసుకుంది.

**ఇషాన్, మోహన్ అద్భుత భాగస్వామ్యం**

తొలి ఇన్నింగ్స్‌లో 372 పరుగుల భారీ ఆధిక్యం ఉన్నప్పటికీ, ఈస్ట్ జోన్ ఫాలో ఆన్ విధించకుండా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించింది. అయితే, ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ (8), అభిమన్యు ఈశ్వరన్ (0) విఫలమవడంతో ఆరంభంలో తడబడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్, శిఖర్ మోహన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 170 బంతుల్లో 126 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. ముఖ్యంగా ఇషాన్ కిషన్ తనదైన శైలిలో విధ్వంసక బ్యాటింగ్‌తో అలరించాడు. కేవలం 98 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 80 పరుగులు చేశాడు. విజయ్ వేసిన ఒకే ఓవర్లో రెండు సిక్సర్లు, రెండు ఫోర్లతో 20 పరుగులు రాబట్టి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మరో భారీ షాట్‌కు ప్రయత్నించి కిషన్ ఔటవగా, నిలకడగా ఆడిన శిఖర్ మోహన్ (52) కూడా పెవిలియన్ చేరాడు.

**ఒక్క పరుగుతో శతకం చేజార్చుకున్న తిలక్ వర్మ**

అంతకుముందు, ఉదయం సెషన్‌లో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సౌత్ జోన్ 336 పరుగులకు ఆలౌటైంది.

కెప్టెన్ తిలక్ వర్మ అద్భుత పోరాట పటిమ కనబరిచాడు. అయితే, దురదృష్టవశాత్తూ ఒక్క పరుగు తేడాతో తన తొమ్మిదో ఫస్ట్‌క్లాస్ సెంచరీని చేజార్చుకున్నాడు. 99 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కౌనైన్ ఖురేషీ బౌలింగ్‌లో రిటర్న్ క్యాచ్ ఇచ్చి నిరాశగా వెనుదిరిగాడు. మరో ఎండ్‌లో సీవీ మిలింద్ (43) అతనికి చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరి నిష్క్రమణ తర్వాత సౌత్ జోన్ ఇన్నింగ్స్ త్వరగా ముగిసింది. ముఖేష్ కుమార్ 3 వికెట్లతో రాణించాడు.

నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. కుమార్ కుశాగ్ర (34 నాటౌట్), ఖురేషీ (26 నాటౌట్) క్రీజులో ఉన్నారు. చివరి రోజు ఆట నామమాత్రమే కాగా, ఈస్ట్ జోన్ విజయం లాంఛనమేనని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.

## వార్‌లో 'దాదా' బాలకృష్ణ.. 3 నెలల ముందే 'కింగ్' గేమ్ స్టార్ట్!





ఈ ఏడాది క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24న ఇండియన్ బాక్సాఫీస్ వద్ద ఊహించని రీతిలో ముగ్గురు అగ్ర కథానాయకుల మధ్య భారీ పోరు షురూ అయింది. ఇది నువ్వా నేనా? అంటూ సాగే ఒక భీకర సమరం. టాలీవుడ్ 'కింగ్' అక్కినేని నాగార్జున నటిస్తున్న మైలురాయి చిత్రం 'కింగ్ 100' బరిలోకి దిగుతుండగా, నటసింహం నందమూరి బాలకృష్ణ తన మాస్ యాక్షన్ పవర్ ప్యాక్డ్ 'దాదా' తో పోటీపడుతున్నారు. వీరికి తోడు బాలీవుడ్ బాద్‌షా షారూఖ్ ఖాన్ తన మోస్ట్ అవైటెడ్ పాన్-ఇండియా యాక్షన్ థ్రిల్లర్ -కింగ్-తో బాక్సాఫీస్‌ను షేక్ చేయడానికి సిద్ధమయ్యారు. డిసెంబర్ 24నే ఈ ముగ్గురూ తమ సినిమాలను విడుదల చేస్తుండటంతో ఆ తేదీకి దాదాపు మూడు నెలల ముందే తెలుగు రాష్ట్రాల్లో థియేటర్ల ఆధిపత్య పోరు - బిజినెస్ గేమ్ హోరాహోరీగా ప్రారంభమైంది.అక్కినేని నాగార్జున తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 100వ చిత్రంగా 'ఖఅఅస్త్ర100'ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. "నాతో డబ్బు లేనప్పుడు లూజర్ అన్నారు.. డబ్బు ఉన్నప్పుడు కింగ్ అన్నారు.. కానీ నా గుర్తింపు డబ్బు కంటే శక్తివంతమైనది" అనే కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ చిత్రం.. ఒక మనిషి అధికారం - స్వయంకృషితో ఎదిగిన ప్రయాణాన్ని అత్యంత గ్రిప్పింగ్‌గా ఆవిష్కరించబోతోంది. నాగార్జున స్వయంగా అన్నపూర్ణ స్టూడియోస్ డిస్ట్రిబ్యూషన్ వింగ్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటినుంచే థియేటర్ల యజమానులతో ఒప్పందాలు కుదుర్చుకుంటూ బాక్సాఫీస్ స్పేస్‌ను సొంతం చేసుకోవడంలో వేగంగా పావులు కదుపుతున్నారు. థియేటర్ల రేసులో మూడు నెలల ముందే కింగ్ హవా చూపిస్తుండటం ఇప్పుడు ఫిలింనగర్ లో చర్చగా మారింది. కంటెంట్ పరంగా ఎమోషన్- క్లాస్- మాస్ ఎలిమెంట్స్ మేళవింపుగా వస్తున్న -కింగ్ 100- పోటీలో నాగార్జునకు మైలేజ్ ఇచ్చేలా కనిపిస్తోంది.

మరోవైపు నందమూరి బాలకృష్ణ -దాదా- రూపంలో భీకరమైన మాస్ పవర్‌తో థియేటర్లపైకి దండయాత్రకు సిద్ధమయ్యారు. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో 1980ల నాటి ముంబై గ్యాంగ్‌స్టర్ కథాంశంతో చారిత్రాత్మక టైమ్‌లైన్ కలయికతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో బాలయ్య -కింగ్ ఆఫ్ కేయాస్-గా కనిపించనున్నారు. థమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్... మాస్ డైలాగ్‌లు.. ముంబై పోలీసులను సైతం శాసించే పవర్‌ఫుల్ డాన్ పాత్రలో బాలయ్య విశ్వరూపం తెలుగు రాష్ట్రాల్లో ఓపెనింగ్స్ పరంగా భారీ రికార్డులను తిరగరాయడానికి సిద్ధంగా ఉంది. బి, సి సెంటర్లలో బాలకృష్ణకు ఉన్న తిరుగులేని మాస్ ఫాలోయింగ్ ఈ క్రిస్మస్ రేసులో -దాదా-ను అత్యంత బలీయమైన ప్రత్యర్థిగా నిలబెడుతోంది.

ఈ తెలుగు దిగ్గజాల పోరు మధ్యలోకి బాలీవుడ్ బాద్‌షా షారూఖ్ ఖాన్ -కింగ్- సైలెంట్ గా ఎంట్రీ ఇస్తుండటం వాతావరణాన్ని మరింత వేడెక్కించింది. సుహాస్ వర్మ, సిద్దార్థ్ ఆనంద్ కాంబినేషన్ నుండి వస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో షారూఖ్ సిల్వర్ హెయిర్ లుక్‌తో సరికొత్త అవతారంలో కనిపించనున్నారు. "సౌ దేశోం మే బద్నామ్.. దునియా నే దియా సిర్ఫ్ ఏక్ హి నామ్ - కింగ్" అనే గ్లోబల్ ప్రొఫైల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా తెలుగు హక్కులను దక్కించుకోవడానికి స్థానిక అగ్ర నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు పోటీపడుతున్నారు. నార్త్ బెల్ట్ - గ్లోబల్ మార్కెట్‌లో ఈ చిత్రం భారీ కలెక్షన్లు సాధిస్తుందనే అంచనాలున్నా దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా తెలుగు మార్కెట్‌లో థియేటర్లను దక్కించుకోవడం ఈ బాలీవుడ్ -కింగ్-కి పెద్ద సవాలుగా మారింది.షారూఖ్ ఖాన్‌కు తన పాన్-ఇండియా స్టార్‌డమ్‌ను నిలబెట్టుకోవడానికి - సౌత్ మార్కెట్‌లో తన పట్టును మరింత బలోపేతం చేసుకోవడానికి -కింగ్- విజయం అత్యంత కీలకం. పఠాన్, జవాన్ చిత్రాలతో సౌత్‌లో భారీ వసూళ్లు రాబట్టిన షారూఖ్ ఈసారి నేరుగా నాగార్జున -కింగ్ 100-, బాలకృష్ణ -దాదా- వంటి పక్కా ప్రాంతీయ దిగ్గజాలతో ఒకే రోజు పోటీపడుతుండటంతో బాక్సాఫీస్ యుద్ధం రసవత్తరంగా మారింది. క్రిస్మస్ పండుగ సీజన్ పెద్ద సినిమాలకు అనుకూలమైనదే అయినా థియేటర్ల కేటాయింపులు, స్క్రీన్ల లభ్యత విషయంలో నాగార్జున పక్కా ప్లానింగ్‌తో ఉండటం.. బాలయ్య మాస్ స్టామినా బలంగా నిలవడం వల్ల తెలుగు గడ్డపై ఈ ముగ్గురు -కింగ్-ల మధ్య సమరం సరికొత్త చరిత్ర సృష్టించబోతోంది.

*Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com*